


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 12 సంచిక : 144 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం గురువారం 29 జనవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :144 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM THU 29 JANUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## విశాఖకు ఏఐజీ ఆసుపత్రి..

### పరిశ్రమలకు భూ కేటాయింపులకు మంత్రిమండలి ఆమోదం



- పోలవరం ప్రాజెక్టు పనులు వేగవంతం చేసేందుకు అదనపు నిధులు మంజూరు
- విశాఖలో ఏఐజీ ఆసుపత్రి ఏర్పాటుకు 9 ఎకరాల భూమి కేటాయింపు
- టిడ్కో ఇళ్ల మౌలిక వసతుల కోసం రూ.4,450 కోట్ల రుణానికి ప్రభుత్వ గ్యారెంటీ
- అమరావతిలో వీధిపోటు ప్లాట్ల స్థానంలో వేరేవి ఇచ్చేందుకు రైతులకు అవకాశం
- అంతర్జాతీయ అథ్లెట్ జ్యోతి యర్రాజీకి గ్రూప్-1 ఉద్యోగం, ఇంటి స్థలం

పెన్ పవర్ డెస్క్:ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిమండలి సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. పోలవరం ప్రాజెక్టును వేగవంతం చేయడం, రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి, పేదలకు గృహ నిర్మాణం మిగతా2లో

## చంద్రబాబు ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన జగన్

- రెండేళ్ల చంద్రబాబు పాలన 'జంగల్ రాజ్'లా ఉందని జగన్ విమర్శ
- మద్యం, ఇసుక మాఫియాలతో రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆరోపణ
- టీడీపీ ఎమ్మెల్యేలు మహిళలపై అరాచకాలకు పాల్పడుతున్నా చర్యలు శూన్యమని వ్యాఖ్య
- సంక్రాంతి పండుగను జూదం, అశ్లీల నృత్యాలతో భ్రష్టు పట్టించారని విమర్శ
- మరో ఏడాదిన్నరలో పాదయాత్ర చేపట్టి ప్రభుత్వాన్ని ఎండగడతానన్న జగన్



మిగతా2లో



## మహారాష్ట్రలో కుప్పకూలిన విమానం

# డిప్యూటీ సీఎం అజిత్ పవార్ దుర్మరణం



### ప్రాణాలు కోల్పోయిన మరో నలుగురు
### ఎన్నికల ప్రచారానికివెళ్తుండగా ఘటన

- సీఎం ఫడ్నవీస్‌కు ప్రధాని మోదీ, అమిత్ షా ఫోన్
- ప్రమాదంలో అజిత్ పవార్ సహా ఐదుగురు మృతి చెందినట్లు డీజీసీఏ ధ్రువీకరణ
- ల్యాండింగ్ సమయంలో అదుపుతప్పి కూలిపోయిన విమానం
- సీఎం ఫడ్నవీస్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్న ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా
- స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారానికి వెళ్తుండగా జరిగిన దుర్ఘటన

ముంబై: పెన్ పవర్మహారాష్ట్రలో విమానం కుప్పకూం ఘటనలో ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ (66) సహా మరో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. జిల్లా పరిషత్ ఎన్నికల ప్రచారం నిమిత్తం ముంబై నుంచి బారామతి వెళ్తుండగా ఉదయం 8.45 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మిగతా2లో



## ఇది ప్రమాదమే.. కుట్ర కాదు

### అజిత్ మృతిపై శరద్ పవార్ భావోద్వేగం

- విమాన ప్రమాదంలో మహారాష్ట్ర నేత అజిత్ పవార్ దుర్మరణం
- ఇది కేవలం ప్రమాదమేనని, కుట్ర కాదని శరద్ పవార్ స్పష్టీకరణ
- సమర్థుడైన నాయకుడిని కోల్పోయామంటూ భావోద్వేగం
- ఈ విషయాన్ని రాజకీయం చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి

మిగతా2లో



## ఈ ఒప్పందం ద్వారా భారత్‌దే పైచేయి అవుతుంది

- భారత్-యూరోపియన్ యూనియన్ వాణిజ్య ఒప్పందం.. అమెరికా వాణిజ్య ప్రతినిధి కీలక వ్యాఖ్యలు
- ఈ ఒప్పందానికి సంబంధించిన వివరాలను పరిశీలించానన్న అమెరికా వాణిజ్య ప్రతినిధి
- దీని వల్ల భారత్‌కే ఎక్కువ ప్రయోజనం ఉంటుందన్న జెమిసన్ గ్రీర్

మిగతా2లో



## వికసిత్ భారత్‌కు 2026 పునాది సంవత్సరం

- పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం
- ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్.. ఈ నెల 29న ఆర్థిక సర్వే ప్రవేశపెట్టనున్న నిర్మల

పెన్ పవర్ డెస్క్:పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈరోజు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఢిల్లీలోని పార్లమెంట్‌లో లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో కూడిన ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ నెల 29న (గురువారం) ఆర్థిక సర్వేను, ఫిబ్రవరి 1న (ఆదివారం) కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ముర్ము మాట్లాడుతూ.. గడిచిన ఏడాది వేగవంతమైన ప్రగతి, గొప్ప సాంస్కృతిక వారసత్వానికి గుర్తుగా నిలిచిపోయిందన్నారు. 'వికసిత్ భారత్' నిర్మాణంలో 2026వ సంవత్సరం ఒక కీలకమైన పునాది సంవత్సరంగా

మిగతా2లో

## జనసేన కాదు.. కామసేన

### ఎమ్మెల్యే శ్రీధర్ వీడియోపై భగ్గుమన్న ఆర్కే రోజా

- జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ వీడియో లీక్‌పై రోజా తీవ్ర ఆగ్రహం
- ఇది జనసేన కాదు, కామాంధుల సేన అంటూ తీవ్ర విమర్శలు
- నగరిలో వైసీపీ నేతలతో కలిసి రోడ్డుపై బైఠాయించి నిరసన
- పవన్, చంద్రబాబు, హోంమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్
- మహిళల భద్రతలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆరోపణ



పెన్ పవర్ డెస్క్:జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌కు సంబంధించిన రాసలీలల వీడియో వ్యవహారం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ ఘటనపై మాజీ మంత్రి, వైసీపీ నాయకురాలు ఆర్కే రోజా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇది జనసేన కాదని, మహిళల జీవితాలతో ఆడుకుంటున్న 'కామసేన' అని ఆమె తీవ్రంగా ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే శ్రీధర్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఆమె సొంత నియోజకవర్గమైన నగరిలో వైసీపీ శ్రేణులతో కలిసి భారీ నిరసన చేపట్టారు. ఈ ఆందోళనలో భాగంగా తిరుపతి, చిత్తూరు

మిగతా2లో


## వెలిగొండపై జగన్‌ది అతిపెద్ద మోసం..

### ఆధారాలతో సహా బయటపెట్టిన మంత్రి నిమ్మల



- వెలిగొండపై జగన్ ప్రభుత్వం ప్రజలను దగా చేసిందన్న మంత్రి నిమ్మల
- పూర్తి కాని ప్రాజెక్టును ఎన్నికల ముందు జాతికి అంకితం చేశారని ఆరోపణ
- టన్నెళ్లు, హెడ్ రెగ్యులేటర్, ఫీడర్ కెనాల్ పనులు అసంపూర్తిగా ఉన్నాయని వెల్లడి
- రూ.900 కోట్ల నిర్వాసితుల ప్యాకేజీని గత ప్రభుత్వం చెల్లించలేదని విమర్శ
- 2026 నాటికి వెలిగొండను పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని స్పష్టీకరణ

మిగతా2లో



## రాష్ట్ర రైల్వే ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు సమీక్ష

- పోర్టుల నుంచి ఇతర రాష్ట్రాలకు రైలు కనెక్టివిటీపై ప్రధానంగా చర్చ
- రాయలసీమ నుంచి కోస్తాకు మెరుగైన రైలు మార్గాలపై దృష్టి
- హై స్పీడ్ రైల్ కారిడార్ల ఏర్పాటు ప్రతిపాదనపై సమావేశంలో సమీక్ష
- విజయవాడ, విశాఖ వంటి జంక్షన్లలో రద్దీ తగ్గించడంపై చర్చ

మిగతా2లో

## అమెజాన్‌లో 16వేల మంది ఉద్యోగులు తొలగింపు




పెన్ పవర్ డెస్క్:ప్రముఖ ఇ-కామర్స్ సంస్థ అమెజాన్ మరోసారి భారీ సంఖ్యలో లేఆఫ్ ప్రకటించింది. గతేడాది అక్టోబర్‌లో 14 వేల మంది కార్పొరేట్ ఉద్యోగులను తొలగించగా.. తాజాగా 16వేల మంది ఉద్యోగులకు ఉద్వాసన పలుకుతున్నట్లు పేర్కొంది.

మిగతా2లో

## ఎడిటర్ వ్యూ

### అజరామరాలు వేటూరి గీతాలు

వేటూరి జయంతి తెలుగు పదానికి పునరావృత జన్మదినం. ఆయన గేయ రచనా వైవిధ్యం ఎందరికో స్ఫూర్తి దాయకం. శ్రీశ్రీ తర్వాత జాతీయ అవార్డు అందుకున్న తెలుగు పాటల రచయత వేటూరి సుందర రామమూర్తి. మాతృదేవోభవ సినిమాలోని రాలిపోయే పువ్వా నీకు రాగాలెందుకే పాటకు ఈ అవార్డు అందుకున్న వేటూరి. ఇటు క్లాసే కాదు.. అటు మాస్ సాంగ్స్ రాయడంలోనూ వేటూరి వారిది అందె వేసిన చెయ్యే. తొమ్మిది వేలకు పైగా అలవోకగా ధారాపాతంగా పాటలు రాసిన గొప్పతనం వేటూరిది. పల్లెటూరి మాటలైనా, సమాస భూయిష్ట సంక్లిష్ట పదాలైనా పండితుని నుండి పామరుని వరకూ అవలీలగా చేరి, సులభంగా ప్రతీ నోటా పాడుకునేలా చేసిన అసమాన ప్రతిభ ఆయనకే సొంతమైంది. వేటూరి సినిమా పాటలు రాయటానికి పూర్వం కొంతకాలం పత్రికల్లో పని చేసారు. తెలుగు భాష, సాహిత్యాలపై మక్కువ పెంచు కోవడానికి కారణం అయన పెదనాన్న వేటూరి ప్రభాకర శాస్త్రి, తెలుగులో ప్రథమ జ్ఞానపీఠ గ్రహీత కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ. 1960 సంవత్సర ప్రాంతాల్లో మొదట ఆంధ్ర పత్రికలో కాలూని, తర్వాత ఆంధ్రపత్రిక వీక్లీకి సహాయ సంపాదకుడుగా, ఆపై కొంతకాలం ఆంధ్రప్రభ వార పత్రిక కు చీఫ్ సబ్ ఎడిటర్ గా అయన పని చేశారు. ఎన్టీఆర్ నటించిన "దీక్ష" సినిమాలో మొదటిసారిగా సినిమాకు గీతరచన ప్రారంభించినా అది సినిమాలో రాలేదు. 1972 సంవత్సరం "ఓ సీత కథ" సినిమాలో లీల పాడిన హరికథతో, సినిమా దర్శకులు కె.విశ్వనాథ్ ప్రోత్సాహంతో సినిమా పాటల రచయితగా శ్రీకారం చుట్టి, వెనుతిరిగి చూడకుండా సాగుతూ, వరసగా సినిమా పాటలు రాస్తూ వచ్చారు. వేటూరిగా పిలవబడే వేటూరి సుందర రామమూర్తి (జనవరి 29, 1936 – మే 22, 2010) లాంటి రచయిత సినీ పరిశ్రమకు పరిచయం కావడం తెలుగు ప్రజలు చేసుకున్న పురాకృత సుకృతం. సుందర రామమూర్తి 1936 జనవరి 29 న కృష్ణా జిల్లా, మోపిదేవి మండలం పెదకళ్ళే పల్లిలో జన్మించారు. మద్రాసులోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఇంటర్మీడియట్, బెజవాడలో డిగ్రీ పూర్తి చేశారు. 1956 నుంచి పదహారేళ్ళ పాటు పాత్రికేయ వృత్తిలో ఉన్నారు. ముందుగా దైతా గోపాలం ఆ తర్వాత మల్లాది వద్ద శిష్యరికం చేశారు. వేటూరి సుందర రామ్మూర్తి 8 నంది అవార్డులతో పాటు మొత్తం 14 అవార్డులు, ఒక జాతీయ పురస్కారం అందుకున్నారు. తెలుగు పాటకు శ్రీశ్రీ తర్వాత జాతీయ ఖ్యాతిని ఆర్జించి పెట్టింది వేటూరియే. కేంద్ర ప్రభుతం తెలుగు భాషకు ప్రాచీన భాషా హోదా ఇవ్వనందుకు నిరసనగా తన పాటకు వచ్చిన జాతీయ పురస్కారాన్ని తిరిగి ఇచ్చి, తన మాతృ భాషాభిమానాన్ని చాటిచెప్పిన మహోన్నత వ్యక్తిత్వం ఆయనది. వేటూరి మొదటి పాట ఓ సీత కథ. చివరి పాట బద్రినాథ్ లోని ఓంకారేశ్వరి పాట. ఆ మధ్యకాలంలో ఆయన వేల పాటలను రాశారు. ఓంకారేశ్వరి పాటలో 108 వైష్ణవ దివ్య స్థలాలను తన పాటలో వ్యక్త పరిచిన తీరు అసమానం. అపూర్వం, మహాద్భుతం. సంప్రదాయ కవిత్వ పద బంధాల నుండి జానపద గీతాల వరకు అన్నింటిలోనూ తన ప్రతిభను నిరూపించు కున్నారు. కవనంలో, భావంలో, భాషలో పండితుల నుండి పామరుల వరకు అందరిని అలరించిన విశిష్ట శైలి ఈయన సొంతం. వేటూరి సినీ పాటల పరంపర నాలుగు దశాబ్దాలకు పైగా నిరాటంకంగా కొనసాగింది. దర్శకులకు, నిర్మాతలకు, నటీ నటులకు, సినీ సంబంధీకులకు ఆలంబనగా నిలిచింది. శ్రోతల హృదయాలను దోచింది. పసలేని చిత్రాలను పాటల ద్వారా తీరాలకు చేర్చింది. ఒక్క మాటలో ... సినీ పరిశ్రమను అన్ని విధాలా ఆదుకుంది. వేటూరి పాటల పూదోటలో ప్రతీ పాటా పరిమళం కొల్పోని సుగంధ పుష్పాలే. ఎన్నటికీ వాడిపోని అందమైన లతాంతాలే. గానగంధర్వుడు దివంగత ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం మాటల్లో చెప్పాలంటే... 'ఉపనిషత్తుల నుంచి ఉలిపిరి కాయితం వరకూ , దేన్ని గురించైనా అపారమైన పరిజ్ఞానం ' వేటూరిది. మహా కవి శ్రీశ్రీ అన్నట్లు...తాను కన్న, విన్న, అనుభవించిన, ఊహించిన ప్రతి అంశాన్ని పదబద్ధం చేసి, కాదేదీ కవితకు అనర్హం అని నిరూపించిన నేర్పరి వేటూరి. వేటూరి భువి నుండి దివికేగినా, ఆయన పాటలు అజరామరాలు, నిరంతరం తెలుగు వారి నాలుకలపై నడయాడే సుస్వరాలు. తెలుగు ప్రజల మనో ఫలకాలపై చెరగని ముద్రలు వేసి 75 సంవత్సరాల వయస్సులో మే 22, 2010 న హైదరాబాదులో గుండెపోటుతో మరణించారు. తెలుగు ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచి పోయారు.

### విశాఖకు ఏఐజీ ఆసుపత్రి..

- మొదటి పేజి తరువాయి

వంటి అంశాలపై కేబినెట్ ప్రధానంగా దృష్టి సారించింది. సమావేశం అనంతరం సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరాలు వెల్లడించారు.

**పోలవరం పూర్తికి అదనపు నిధులు**

వచ్చే ఏడాది మార్చి–ఏప్రిల్ నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి తెలిపారు. డ్యామ్ నిర్మాణానికి అవసరమైన రాయిని సేకరించేందుకు రూ. 247 కోట్లు, లెఫ్ట్ సైడ్ కనెక్టివిటీలో నావిగేషన్ టన్నెల్ నిర్మాణం కోసం రూ. 4.49 కోట్ల అదనపు బడ్జెట్‌కు కేబినెట్ ఆమోదం తెలిపిందని వివరించారు. డ్యామ్ నిర్మాణానికి 71.63 లక్షల క్యూబిక్ మీటర్ల రాయి అవసరం కాగా, గతంలో తవ్విన రాళ్లలో 50% మాత్రమే నాణ్యంగా ఉన్నాయని, అందువల్ల హిల్ నెం. 902 నుంచి కొత్తగా రాయిని వెలికితీయడానికి ఈ నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ పనులను మెగా ఇంజనీరింగ్ లిమిటెడ్ (వీజుxూ)కు అప్పగించారు.

**గృహ నిర్మాణం, అమరావతిపై కీలక నిర్ణయాలు**

ప్రధానమంత్రి ఆవాస్ యోజన (అర్బన్) కింద టిడ్కో ఇళ్ల నిర్మాణానికి అవసరమైన మౌలిక వసతుల కోసం హడ్కో నుంచి రూ. 4,450 కోట్ల రుణం పొందేందుకు ఏపీ టిడ్కోకు ప్రభుత్వం ఇచ్చిన గ్యారెంటీని కేబినెట్ రాటిఫై చేసింది. గత ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్లక్ష్యం చేసిందని, ఈ ప్రభుత్వం జూన్ నాటికి పెండింగ్ ఇళ్లను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుందని మంత్రి స్పష్టం చేశారు. కొత్తగా ఇళ్ల కోసం వచ్చిన 10 లక్షల దరఖాస్తులను పరిశీలిస్తున్నామని, 2029 నాటికి అర్హులైన పేదలందరికీ ఇళ్లు అందించడమే లక్ష్యమని సీఎం ఆదేశించినట్లు తెలిపారు.

అమరావతిలో భూసమీకరణలో భాగంగా ప్లాట్లు పొందిన రైతుల్లో వీధిపోటు, ఇతర వాస్తు సమస్యలు ఉన్న 112 మందికి వేరే ప్లాట్లు కేటాయించేందుకు సీఆర్‌డీఏ కమిషనర్‌కు అధికారం ఇస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అయితే, ఈ అవకాశం ఒరిజినల్ అలాటీలకు మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేసింది. అలాగే, రాజధాని ప్రాంతంలో భూమిలేని నిరుపేదలకు ఇచ్చే రూ. 5000 పెన్షన్‌ను, వారి తల్లిదండ్రులు మరణిస్తే మైనర్ పిల్లలకు బదిలీ చేసేందుకు కూడా ఆమోదం లభించింది.

## వికసిత్ భారత్‌కు 2026 పునాది సంవత్సరం

- మొదటి పేజి తరువాయి

నిలుస్తుందని ఆమె అభివర్ణించారు. గత దశాబ్ద కాలంలో భారత్ అన్ని ప్రధాన రంగాలలో తన పునాదులను పటిష్ఠం చేసుకుందని, భవిష్యత్ వృద్ధికి బలమైన మార్గాన్ని నిర్మించుకుందని పేర్కొన్నారు.బంకించంద్ర ఛటర్జీ రచించిన 'వందేమాతరం' గీతం 150 ఏళ్లు పూర్తి చేసుకున్న వేడుకలను ఆమె గుర్తుచేశారు. శ్రీ గురు తేజ్ బహదూర్ జీ 350వ షహీదీ దివస్, బిర్సా ముండా, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాలను ప్రస్తావించారు. దేశం తన పూర్వీకుల సేవలను గౌరవించుకున్నప్పుడు, యువతరంలో స్ఫూర్తి రగులుతుందని, అది అభివృద్ధి చెందిన భారత్ దిశగా దేశ ప్రయాణాన్ని వేగవంతం చేస్తుందని రాష్ట్రపతి తెలిపారు. కాగా, సమావేశాలకు ముందు మంగళవారం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం జరిగింది. సభా కార్యకలాపాలు సజావుగా సాగేందుకు సహకరిస్తామని నేతలు హామీ ఇచ్చారు. ఓట్ల దొంగతనం ఆరోపణలు, ఓటర్ల జాబితా సవరణ, ధాన్యం సేకరణ, ఉపాధి హామీ పథకం వంటి ప్రజా సమస్యలపై దృష్టి సారిస్తామని కాంగ్రెస్ పార్టీ ఈ సమావేశంలో తెలిపింది.

# మహారాష్ట్రలో కుప్పకూలిన విమానం

# డిప్యూటీ సీఎం అజిత్ పవార్ దుర్మరణం

- మొదటి పేజి తరువాయి

సాంకేతిక లోపం కారణం గానే ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోం ది. ముంబై నుంచి బయల్దేరిన గంట తర్వాత విమానంలో సమస్య తలెత్తింది. ఎమర్జెన్సీ ల్యాండింగ్ సమయంలో విమానం అదుపుతప్పి కూలిపోయింది. ఆ వెంటనే భారీగా మంటలు చెలరేగాయి. ప్రమాద తీవ్రతకు విమానం రెండు ముక్కలైనట్లు సమాచారం. విమాన ప్రమాదం పై డీజీసీఏ స్పందించింది. విమానంలో ఎవరూ బతికి లేరని వెల్లడించింది. అజిత్ పవార్, ఇద్దరు వ్యక్తిగత సిబ్బంది, ఇద్దరు విమాన సిబ్బంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపింది. అజిత్ పవార్ 1959 జులై 22న జన్మించారు. ఆయన తండ్రి అనంత్రావ్ పవార్.. మహారాష్ట్ర మాజీ సీఎం శరద్ పవార్కు సోదరుడు. బాబాయి శరద్ పవార్ అడుగుజాడల్లో రాజకీయాల్లో కి అడుగుపెట్టిన అజిత్పవార్.. 1982లో తొలిసారి కార్పొరేటివ్ షుగర్ ఫ్యాక్టరీ బోర్డుకు ఎన్నికయ్యారు. ఆ తర్వాత 16 ఏళ్ల పాటు పుణె జిల్లా సెంట్రల్ కోఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్గా వ్యవహరించారు. 1991లో తొలిసారి బారామతి పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి లోక్సభకు ఎన్నికయ్యారు. అనంతరం శరద్ పవార్ కోసం ఆ సీటును త్యాగం చేసి.. రాష్ట్ర రా జకీయాల్లోకి వచ్చారు. 1991 ఉప ఎన్నికల్లో బారామతి అసెంబ్లీ స్థానం నుంచి గెలుపొం దారు. ఈ నియోజకవర్గం నుంచి ఏడుసార్లు మహారాష్ట్ర ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ప్రస్తుతం సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ నేతృత్వంలోని మహాయుతి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు.

## వెలిగొండపై జగన్‌ది అతిపెద్ద మోసం..

గత వైసీపీ ప్రభుత్వం వెలిగొండ ప్రాజెక్టు విషయంలో ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజలను ఘోరంగా మోసం చేసిందని, పనులు పూర్తికాకుండానే ఎన్నికల ముందు హడావుడిగా ప్రారంభించి 'క్రెడిట్ చోరీ'కి పాల్పడిందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల నిర్లక్ష్యాన్ని, ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో జరుగుతున్న పనుల పురోగతిని గణాంకాలు, ఫొటోలతో సహా వివరించారు. 2026 నాటికి వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గనిర్దేశంలో పనిచేస్తున్నామని స్పష్టం చేశారు.

గత మార్చి 6న, ఎన్నికలకు ముందు, నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వెలిగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేశారని, కానీ ఆ రోజుకు ప్రాజెక్టులో కీలకమైన పనులన్నీ అసంపూర్తిగానే ఉన్నాయని నిమ్మల ఆరోపించారు. "ప్రాజెక్టు పూర్తయితే పండగ వాతావరణం ఉండాలి. కానీ, ఆనాడు 144 సెక్షన్ పెట్టి, రైతు నాయకులను, నిర్వాసితులను హౌస్ అరెస్టులు చేసి పోలీసు పహారా మధ్య ప్రారంభోత్సవం చేయడం, జగన్ ప్రభుత్వ మోసానికి నిలువెత్తు నిదర్శనం" అని ఆయన విమర్శించారు.

**పూర్తి కాని పనులు.. ప్రమాదకర స్థితి**

మంత్రి నిమ్మల ప్రాజెక్టులోని ప్రతి దశలోనూ వైసీపీ ప్రభుత్వం వదిలేసిన పనులను వివరంగా తెలియజేశారు.

హెడ్ రెగ్యులేటర్: శ్రీశైలం నుంచి నీటిని టన్నెల్‌లోకి మళ్లించే హెడ్ రెగ్యులేటర్ వద్ద 4,300 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పని మిగిలి ఉండగానే ప్రాజెక్టును ప్రారంభించారని తెలిపారు. దానికి రక్షణగా ఉండే వింగ్స్, రిటర్న్స్ నిర్మించకపోవడంతో నీటిని వదిలితే మొత్తం నిర్మాణం కూలిపోయే ప్రమాదం ఉండేదని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పనులను శరవేగంగా పూర్తి చేస్తున్నట్లు చెప్పారు.

టన్నెల్ 1 & 2: టన్నెల్ 1లో 1.20 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తొలగించాల్సి ఉందని, టన్నెల్ 2లో దాదాపు 7 కిలోమీటర్ల లైనింగ్, 4,924 మీటర్ల బెంచింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. "లైనింగ్ చేయకుండా నీటిని వదిలితే సొరంగం కూలిపోయే ప్రమాదం ఉంది. వైకాపా ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం 702 మీటర్ల లైనింగ్ చేస్తే, మేము 18 నెలల్లోనే 3,708 మీటర్ల పని పూర్తి చేశాం" అని ఆయన పోల్చి చెప్పారు.టన్నెల్ బోరింగ్ మెషిన్ (ఠదీవీ): టన్నెల్ 2లో 11వ కిలోమీటరు వద్ద 600 అడుగుల పొడవైన భారీ టన్నెల్ బోరింగ్ మెషిన్ (ఠదీవీ) చిక్కుకుపోయిందని, అది నీటి ప్రవాహాన్ని పూర్తిగా అడ్డుకుంటుందని తెలిపారు. దాన్ని తొలగించకుండా హైకోర్టు ఇచ్చిన స్టేను వెకేట్ చేయించడానికి కూడా గత ప్రభుత్వం ప్రయత్నించలేదని ఆరోపించారు.

ఫీడర్ కెనాల్, నిర్వాసితులు: 11,500 క్యూసెక్కుల నీటిని తట్టుకోవాల్సిన 21 కిలోమీటర్ల ఫీడర్ కెనాల్, చిన్నపాటి వర్షానికే గండ్లు పడిన దారుణ స్థితిలో ఉందని ఫొటోలు చూపించారు. ఇప్పుడు రూ.456 కోట్లతో ఈ పనులను ప్రారంభించామని తెలిపారు. అత్యంత ముఖ్యంగా, ప్రాజెక్టు కోసం భూములు త్యాగం చేసిన నిర్వాసితులకు ఇవ్వాల్సిన రూ.900 కోట్ల ఆర్&ఆర్ ప్యాకేజీని గత ప్రభుత్వం చెల్లించలేదని, పునరావాస కాలనీల నిర్మాణం చేపట్టలేదని మండిపడ్డారు.

**పదేపదే తప్పుడు తేదీలు**

జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు 2020 నుంచి 2023 వరకు నాలుగుసార్లు వేర్వేరు తేదీల్లో ప్రాజెక్టును పూర్తి చేస్తామని చెప్పి, చివరకు ఏ పనీ చేయకుండా ఎన్నికల ముందు ప్రారంభోత్సవ నాటకమాడారని నిమ్మల విమర్శించారు. పూర్తికాని ప్రాజెక్టుకు బడ్జెట్‌లో నిధులు కావాలని వైకాపా ఎమ్మెల్యేలే అడగడం వారి మోసానికి సాక్ష్యమని అన్నారు. హంద్రీనీవా తరహాలోనే, వెలిగొండను కూడా 2026 నాటికి పూర్తి చేసి ప్రకాశం జిల్లా రైతుల దశాబ్దాల కలను నిజం చేస్తామని మంత్రి రామానాయుడు భరోసా ఇచ్చారు.

## చంద్రబాబు ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన జగన్

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని టీడీపీ కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. భీమవరం పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గడిచిన రెండేళ్ల పాలనలో రాష్ట్రంలో 'జంగల్ రాజ్' నడుస్తోందని, 'దోచుకో, పంచుకో, తినుకో' అనే రీతిలో పాలన సాగుతోందని ఘాటుగా విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలన్నీ అబద్ధాలేనని తేలిపోయిందని అన్నారు."చంద్రబాబు ప్రభుత్వం వచ్చి రెండేళ్లు కావస్తోంది. ఈ రెండేళ్లలో రైతులు, మహిళలు, యువత సహా ఏ ఒక్క వర్గానికైనా మంచి జరిగిందా? మా ప్రభుత్వంలో అమలు చేసిన పథకాలన్నీ రద్దు చేశారు. మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌గా భావించి ప్రతి హామీని నెరవేర్చిన పాలన మాది. కానీ ఇప్పుడు హామీలను మోసపూరితంగా గాలికొదిలేశారు. ఎన్నికలప్పుడు బాండ్లు పంచిపెట్టి ప్రజలను దగా చేశారు. ఇలాంటి మోసాలు చేసే వారిపై 420 కేసులు పెడతారు. కానీ చంద్రబాబు, ఆయన కూటమి నేతలు మాత్రం బయట తిరుగుతున్నారు," అని జగన్ విమర్శించారు.రాష్ట్రంలో విచ్చలవిడి అవినీతి రాజ్యమేలుతోందని జగన్ ఆరోపించారు. "మద్యం వ్యాపారం మొత్తం మాఫియా చేతుల్లోకి వెళ్లింది. ప్రైవేట్ షాపులన్నీ వాళ్ల మనుషులకే ఇచ్చారు. గ్రామాల్లో బెల్ట్ షాపులను వేలం పెట్టి మరీ అమ్ముకుంటున్నారు. ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరకు అమ్ముతూ, పర్మిట్ రూమ్‌లు నడుపుతూ, కల్తీ మద్యం అమ్ముతూ ప్రజల రక్తం తాగుతున్నారు. ఇసుక మా హయాంలో ప్రభుత్వానికి ఏటా రూ.750 కోట్లు ఆదాయం తెచ్చిపెడితే, ఇప్పుడు ఫ్రీ అని చెప్పి అక్రమంగా తవ్వేస్తూ రెట్టింపు ధరకు అమ్ముతున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు," అని జగన్ ఆరోపించారు.సంక్రాంతి పండుగను జూదం, అశ్లీల నృత్యాలతో భ్రష్టు పట్టించారని, ఇది జంగల్ రాజ్ కాకపోతే మరేమిటని ఆయన ప్రశ్నించారు. "రోడ్లపై రికార్డింగ్ డ్యాన్సులు, మొబైల్ వ్యాన్లలో మద్యం అమ్మకాలు జరిపారు. ఈ అరాచకాల కోసం నియోజకవర్గాల్లో వేలం పాటలు నిర్వహించారు. 'ఊపేయ్, కుదిపేయ్' అంటూ యూనిఫామ్‌లో ఉన్న డీఎస్పీనే ప్రోత్సహించడం సిగ్గుచేటు," అని మండిపడ్డారు.టీడీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు మహిళలపై అరాచకాలకు పాల్పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని జగన్ ఆరోపించారు. "కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఒక ప్రభుత్వ ఉద్యోగినిని రేప్ చేస్తే, ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ వేధింపులతో ఒక ప్రిన్సిపాల్ ఆత్మహత్యాయత్నం చేస్తే చర్యలు లేవు. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, మంత్రి సంధ్యారాణి పీఏ, గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే నజీర్‌లపై తీవ్ర ఆరోపణలు వచ్చినా పట్టించుకోలేదు. స్వయంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ అశ్లీల నృత్యాలు చేస్తూ చిందులేస్తున్నారు. చంద్రబాబు, ఆయన కుమారుడే వీరందరినీ ప్రోత్సహిస్తున్నారు," అని జగన్ ఆరోపించారు.ఇంకో ఏడాదిన్నరలో తన పాదయాత్ర ప్రారంభమవుతుందని, సుమారు 150కి పైగా నియోజకవర్గాల్లో పర్యటించి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతానని జగన్ ప్రకటించారు. "కళ్లు తెరిచి మూసేలోగా మూడేళ్లు గడిచిపోతాయి. నా పాదయాత్ర మొదలైతే ప్రజల్లోనే ఉంటాను. చంద్రబాబు ప్రభుత్వ అన్యాయాలను ప్రతి ఇంట్లోనూ చర్చ జరిగేలా చేయాలి. కార్యకర్తలు సంఘటితంగా ఉండి, అనుబంధ విభాగాలను బలోపేతం చేయాలి. జగన్ 2.0లో కార్యకర్తలకే ప్రథమ స్థానం ఉంటుంది," అని ఆయన భరోసా ఇచ్చారు.

## రాష్ట్ర రైల్వే ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు సమీక్ష

ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే ప్రాజెక్టుల పురోగతి, కొత్త మార్గాల ఏర్పాటుపై సీఎం చంద్రబాబు దృష్టి సారించారు. సచివాలయంలో దక్షిణ మధ్య, తూర్పు కోస్తా, దక్షిణ కోస్తా రైల్వే డివిజన్ల జనరల్ మేనేజర్లు, ఇతర ఉన్నతాధికారులతో ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో రైలు కనెక్టివిటీని మెరుగుపరచడం ద్వారా ఆర్థిక కార్యకలాపాలను వేగవంతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

రాష్ట్రంలోని వివిధ పోర్టుల నుంచి తెలంగాణ, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలోని హింటర్ ల్యాండ్‌కు సరుకు రవాణాను పెంచేందుకు అవసరమైన రైలు అనుసంధానంపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. అలాగే, రాయలసీమ ప్రాంతాల నుంచి కోస్తాంధ్రలోని వివిధ ప్రాంతాలకు కనెక్టివిటీని మెరుగుపరిచే అంశాలపైనా సమీక్షించారు.విశాఖపట్నం, విజయవాడ, గుంతకల్, గుంటూరు,

రేణిగుంట వంటి ప్రధాన జంక్షన్లలో రైళ్ల రద్దీని తగ్గించే మార్గాలపై అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. విజయవాడ బైపాస్, భద్రాచలం రోడ్–కొవ్వూరు వంటి కొత్త రైల్వే లైన్ల ప్రతిపాదనల పురోగతిని కూడా సీఎం సమీక్షించారు. గిరిజన ప్రాంతాలకు రైలు సౌకర్యాన్ని విస్తరించడంపై ప్రత్యేకంగా చర్చించారు.

హైదరాబాద్–చెన్నై, చెన్నై–బెంగళూరు, హైదరాబాద్–బెంగళూరు మార్గాలను హై స్పీడ్ రైల్వే కారిడార్లుగా అభివృద్ధి చేసే ప్రణాళికలపైనా ఈ సమావేశంలో చర్చించారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి రైల్వే నెట్‌వర్క్ విస్తరణ కీలకమని ఈ సందర్భంగా చంద్రబాబు అభిప్రాయపడినట్లు తెలుస్తోంది.

## ఇది ప్రమాదమే.. కుట్ర కాదు

మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎన్సీపీ అధినేత అజిత్ పవార్ విమాన ప్రమాదంలో మృతి చెందిన ఘటనపై సీనియర్ నాయకుడు శరద్ పవార్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. ఇది కేవలం ప్రమాదం మాత్రమేనని, దీని వెనుక ఎలాంటి కుట్ర లేదని ఆయన స్పష్టం చేశారు. "అజిత్ పవార్ మరణంతో మహారాష్ట్రకు తీరని నష్టం వాటిల్లింది. ఒక సమర్థుడైన నాయకుడిని ఈ రోజు మనం కోల్పోయాం. ఈ లోటు ఎప్పటికీ పూడ్చలేనిది" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు."అన్నీ మన చేతుల్లో ఉండవు. కొన్ని సంఘటనల వెనుక ఎలాంటి రాజకీయం ఉండదు. దయచేసి ఈ విషయాన్ని రాజకీయం చేయవద్దు. ఈ బాధను మహారాష్ట్ర, మనమందరం ఎప్పటికీ భరించాల్సిందే" అని శరద్ పవార్ అన్నారు. కాగా, అజిత్ పవార్ ప్రయాణిస్తున్నది వీఎస్ఆర్ ఏవియేషన్‌కు చెందిన బాంబార్డియర్ లియర్ జెట్– 45 విమానంగా అధికారులు గుర్తించారు. ప్రమాద స్థలంలో దట్టమైన పొగలు కమ్ముకున్న దృశ్యాలు టీవీ ఛానళ్లలో ప్రసారమయ్యాయి.

## ఈ ఒప్పందం ద్వారా భారత్‌దే పైచేయి అవుతుంది

భారత్–యూరోపియన్ యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై అమెరికా స్పందించింది. ఈ మేరకు అగ్రరాజ్యం వాణిజ్య ప్రతినిధి జెమిసన్ గ్రీర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి సంబంధించి కొన్ని వివరాలను పరిశీలించానని, దీని వల్ల భారత్‌కే ఎక్కువ ప్రయోజనం ఉంటుందని అన్నారు. ఐరోపా మార్కెట్‌లో భారత్‌కు ఎక్కువ అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. దీంతో ఈ ఒప్పందం ద్వారా భారత్‌ది పైచేయి అవుతుందని అన్నారు.భారతీయ నిపుణులకు ఐరోపా దేశాల్లో ఎక్కువ అవకాశాలు లభిస్తాయని ఆయన అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దేశీయ ఉత్పత్తులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని గుర్తు చేశారు. మా దేశంలోకి దిగుమతి అయ్యే ఉత్పత్తులపై అధిక టారిఫ్ విధిస్తుండటంతో పలు దేశాలు తమ ఉత్పత్తుల కోసం ఇతర మార్కెట్ల వైపు చూస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఈయూ, భారత్ మధ్య ఒప్పందం కుదిరినట్లు వెల్లడించారు.

## అమెజాన్‌లో 16వేల మంది ఉద్యోగులు తొలగింపు

- మొదటి పేజి తరువాయి

ఈ విషయాన్ని సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బెత్ గలెటీ అధికారికంగా వెల్లడించారు. 2023 తర్వాత ఈ స్థాయిలో ఉద్యోగులను తొలగించడం ఇదే తొలిసారి. అప్పుడు దాదాపు 27వేల మందికి అమెజాన్ లేఆఫ్‌లు ప్రకటించిన విషయం తెలిసిందే.తొలగింపు ప్రక్రియలో భాగంగా.. కార్పొరేట్ ఉద్యోగుల స్థానంలో జనరేటివ్ ఏఐను వినియోగించే యోచనలో ఉన్నట్లు అమెజాన్ పేర్కొంది. కరోనా సమయంలో తీసుకున్న ఉద్యోగుల సంఖ్యలో భారీగా కోత విధిస్తున్నట్లు తెలిపింది. పలు విభాగాలను తగ్గించి, భాగస్వామ్యం పెంచడం, పాలనా వ్యవస్థలను తొలగించే ప్రక్రియ చేపట్టినట్లు వెల్లడించింది. అయితే, ఏయే విభాగాల్లో ఈ తొలగింపులు ఉంటాయనే విషయంపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు.అక్టోబర్‌లో చేపట్టిన సంస్థాగత మార్పులు పూర్తయ్యాయని వెల్లడించిన గలెటీ.. అంతర్గతంగా కొత్త రోల్ వెతుక్కునేందుకు అమెరికా ఉద్యోగులకు 90 రోజుల గడువు ఇస్తున్నామని చెప్పారు. ఆలోగా కొత్త రోల్‌ను ఎంచుకోని వారికి నిబంధనల ప్రకారం ఇతర ప్రయోజనాలు అందిస్తామన్నారు. ఈ మార్పులు చేస్తూనే వ్యూహాత్మక విభాగాల్లో నియామకాలు కొనసాగిస్తామన్నారు.

## జనసేన కాదు.. కామసేన

- మొదటి పేజి తరువాయి

జిల్లాల వైసీపీ అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డప్ప తదితరులతో కలిసి రోజా ఏజేఎస్ కళ్యాణ మండపం నుంచి ఓం శక్తి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అధికార మదంతో ఒక మహిళా ఉద్యోగిని బెదిరించి, ఆమె జీవితాన్ని నాశనం చేసిన కీచక ఎమ్మెల్యేను తక్షణమే శిక్షించాలని డిమాండ్ చేశారు.

**పవన్, చంద్రబాబు, హోంమంత్రిపై తీవ్ర విమర్శలు**

ఈ సందర్భంగా రోజా మాట్లాడుతూ జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "ఆడవాళ్లకు అన్యాయం చేస్తే రోమాలు పీకేస్తా, చర్మం ఒలుస్తా అని ఊగిపోయే పవన్ కల్యాణ్ ఇప్పుడు ఎక్కడ? ఏం చేస్తున్నారు?" అని సూటిగా ప్రశ్నించారు. "గతంలో జానీ మాస్టర్, కిరణ్ రాయల్, వినూత్న వంటి వారు తప్పు చేసినప్పుడే కఠిన చర్యలు తీసుకుని ఉంటే, ఈరోజు మీ ఎమ్మెల్యే శ్రీధర్ ఇంతటి దుశ్చర్యకు పాల్పడేవాడా?" అని నిలదీశారు. వీడియోలో ఆధారాలు స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ, త్రీ–మెన్ కమిటీ వేసి కాలయాపన చేయడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు ఇచ్చే ప్యాకేజీలు, స్పెషల్ ఫ్లైట్ల కోసమే పవన్ రాష్ట్రానికి వస్తారని, ప్రజల కష్టాలను పట్టించుకోరని ఆరోపించారు.

అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, హోంమంత్రి వంగలపూడి అనితపైనా రోజా విమర్శల వర్షం కురిపించారు. మహిళా హోంమంత్రి ఉన్నప్పటికీ రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని, తన సొంత జిల్లా విశాఖలో డ్రగ్స్, గంజాయిని అరికట్టలేని మంత్రి రాష్ట్రాన్ని ఏం కాపాడతారని ఎద్దేవా చేశారు. గతంలో కాల్ మనీ సెక్స్ రాకెట్ అయినా, ఇప్పుడు సొంత పార్టీ, మిత్రపక్ష ఎమ్మెల్యేల అరాచకాలైనా మహిళలను కాపాడటంలో చంద్రబాబు పూర్తిగా విఫలమయ్యారని, ఆయనో 'చేతగాని దద్దమ్మ ముఖ్యమంత్రి' అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్, హోంమంత్రి అనిత తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని రోజా డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వంలో మహిళల ఆత్మగౌరవానికి రక్షణ లేదనడానికి ఈ ఘటనే నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. వైసీపీ ఆందోళనతో నగరిలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# చీపురుపల్లిలో బారసాల వేడుకల్లో సిరమ్మ



**బిమిలి, పెన్ పవర్, జనవరి 28 :**చీపురుపల్లి నియోజకవర్గం, చీపురుపల్లి మండ లం పర్ల గ్రామంలో మండల శ్రీనివా స్‌రాజేశ్వరి దంపతుల కుమార్తె వేదన్ని బారసాల కార్యక్ర మం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్య క్రమానికి ఉమ్మడి విజయ నగరం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, భీమిలి నియో జకవర్గ సమన్వ యకర్త మజ్జి శ్రీనివాసరావు కుమార్తె, చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరమ్మ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారి వేదన్షిని ఆశీర్వదిం చారు. ఈ సందర్భంగా సిరమ్మ మాట్లాడుతూ, చిన్నారికి మంచి ఆయుష్షు, ఆరోగ్యం, విద్యాబు ద్ధులు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్య క్షులు తోట వాసు, సంస్థ సభ్యులు పెద్ద సంఖ్య లో పాల్గొని కుటుంబ సభ్యులను అభినందిం చారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

## మారుమూల గ్రామ ప్రజలకు రవాణా సౌకర్యాలను మెరుగుపరచడమే లక్ష్యం





- కొమరాడ మండలంలో అభివృద్ధి పనులకు శ్రీకారం
- 23.44 కోట్లతో 11 డోలీ గ్రామాల రోడ్లకు శంకుస్థాపన
- దశాబ్దాలుగా రవాణాలేని గ్రామాలకు మార్గం సుగమం
- అత్యవసర సమయాల్లో త్వరితగతిన అందనున్న వైద్య సేవలు
- జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్. పార్వతీపురం, జనవరి 28 :** గిరిజన మారుమూల గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యాలను మెరుగుపరచడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం కృషిచేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి పేర్కొన్నారు. కొమరాడ మండలంలో పలు రహదారి పనులను కురుపాం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరితో కలిసి జిల్లా కలెక్టర్ బుధవారం శంకుస్థాపన చేశారు. 23.44 కోట్లతో 11 డోలీ గ్రామాల్లో 60 బీటీ రోడ్లకు శంకుస్థాపన చేసారు. ఎన్నో దశాబ్దాలుగా రవాణాలేని డోలీ గ్రామాలకు మార్గం సుగమం కానున్నట్లు కలక్టర్ తెలిపారు. ముందుగా కొమరాడ మండలం తీగలపాడు గ్రామం నుండి జొప్పంగి గ్రామానికి రోడ్డు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ స్వయంగా ప్రొక్లయినర్ నడిపి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద మండలంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం భారీ నిధులు మంజూరు చేసిందన్నారు. మండలంలోని వివిధ గ్రామాలను కలుపుతూ సుమారు 23 కోట్ల 44 లక్షల రూపాయల అంచనా వ్యయంతో మంజూరైన 11 ప్రధాన బి.టి. (డోలీ) రోడ్ల నిర్మాణ పనులకు ప్రజా ప్రతినిధులతో కలిసి ఘనంగా శంకుస్థాపన చేసుకోవడం జరిగిందని అన్నారు. ఈ రోడ్ల నిర్మాణం పూర్తయితే గిరిజన ప్రాంతాల్లోని గ్రామాలకు రాకపోకలు సులభతరం కావడమే కాకుండా, అత్యవసర సమయాల్లో వైద్య సేవలు త్వరితగతిన అందుతాయని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎన్నో ఏళ్లుగా రహదారి సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్న తమ గ్రామాలకు రోడ్లు మంజూరు చేసినందుకు కురుపాం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి కృతజ్ఞతలు తెలిపారు. కాగా స్థానిక ప్రజలు, నాయకులు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్ కు సంప్రదాయ వాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి,సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, స్థానిక ప్రజాప్రతినిధులు, ఇంజినీరింగ్ అధికారులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## శిథిలావస్థలో పోకలపాలెం కునుకూరు పాఠశాలలు

**మారుమూల ఎంపీపీ పాఠశాలల్లో మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు**





**కొయ్యూరు, పెన్ పవర్ జనవరి 28 :** ఎన్నో ప్రభుత్వాలు మారుతున్న మారుమూల పాఠశాలలో స్కూల్ బిల్డింగులు శిధిలావస్థలో వున్నా పట్టించుకునే నాదుడే కరువయ్యాడు. మారుమూల బూదరాళ్ల పంచాయతీ పోకల పాలెం, కు నుకూరు ఎంపీపీ పాఠశాలలు పూర్తి శిథిలావస్థలో ఉన్నాయి. కనీస త్రాగునీరు, విద్యుత్తు, మరుగుదొడ్లు, లేక విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. పైకప్పు రేకులు , వర్షపు నీటితో కారేలా ఉన్నాయి. బీటలు పడి ఉన్నాయి. పోకల పాలెం పాఠశాల పరిస్థితి అయితే మరి నిర్లక్ష్యంగా అధికారులు పట్టించుకోవడంలేదని చైర్మన్, దాసు, శివకుమార్ లు ఆరోపించారు.. వెంటనే పోకల పాలెం, కునుకూరు పాఠశాలకు కొత్త భవనం మంజూరు చేయాలని, విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్తులు, కోరుతున్నారు.

## కాఫీ కార్మికుల డిమాండ్లు నెరవేర్చకపోతే ఫిబ్రవరి 12న సమ్మె!



ఏపీఎఫ్‌డీసీ కాఫీ కార్మికుల సమ్మె నోటీసు

**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జనవరి 27:**మండలంలోని ఏపీ ఎఫ్‌డీసీలో పనిచేస్తున్న కాఫీ కార్మికుల న్యాయమైన డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఫిబ్రవరి 12న చేపట్టనున్న సమ్మెకు సంబంధించిన ముందస్తు నోటీసును కార్మిక సంఘాల నాయకులు అధికారులకు అందజేశారు. కార్మికుల హక్కులను దెబ్బతీసే విధంగా ఉన్న వేతనాల కోడ్2019, ఇండస్ట్రియల్ రిలేషన్ కోడ్2020, వృత్తి భద్రత, ఆరోగ్యం మరియు పని పరిస్థితుల కోడ్2020, సామాజిక భద్రత కోడ్2020లను వ్యతిరేకిస్తూ ఈ సమ్మెకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఈ కోడ్లు కార్మికులు కష్టపడి సాధించుకున్న హక్కులను నీరుగారుస్తూ, సమూహ చర్చలను బలహీనపరిచి, సమూహ హక్కులను పరిమితం చేయడంతో పాటు కాంట్రాక్టు విధానాన్ని ప్రోత్సహించి ఉద్యోగ భద్రత, సామాజిక రక్షణకు భంగం కలిగిస్తున్నాయని వారు పేర్కొన్నారు. అదేవిధంగా కనీస వేతనం నెలకు రూ.26 వేల కంటే తక్కువ కాకుండా నిర్ణయించాలని, ట్రేడ్ యూనియన్ల డిమాండ్ మేరకు 'సమాన పనికి సమాన వేతనం' సూత్రాన్ని అమలు చేయాలని కోరారు. ఈ డిమాండ్లతో కాఫీ కార్మికుల ముందస్తు సమ్మె నోటీసును ఏఐటీయూసీ అధ్యక్షుడు వంతల టిస్‌బాబు, కార్యదర్శి కంకిపాటి సత్తిబాబు ఏపీ ఎఫ్‌డీసీ అధికారులకు అందజేశారు.

# ఈ నెల జనవరి 31తేదిన పింఛన్ లు పంపిణీ

**చింతపల్లి ఎంపీడీవో సీతామహాలక్ష్మి**

**చింతపల్లిపెన్ పవర్ జనవరి 28 :-**

చింతపల్లి మండలంలో పింఛన్ లు లబ్ధిదారులకు ప్రభుత్వం ఊరట కలిగించే నిర్ణయం తీసుకుంది. ఫిబ్రవరి ఒకటో తేదీ ఆదివారం సెలవు దినం రావడంతో, లబ్ధిదారులు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఒక రోజు ముందుగా జనవరి 31వ తేదీ శనివారం పింఛన్ లు పంపిణీని చేయుచున్నట్లు చింతపల్లి ఎంపీడీవో సీతామహాలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు

ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్లు పంపిణీ చేస్తారు, అయితే ఈసారి ఒకటో తేదీ ఆదివారం కావడంతో పంపిణీ ప్రక్రియకు ఆటంకం కలగకుండా అధికారులు ఈ ముందస్తు ఏర్పాట్లు చేశారు. శనివారం ఉదయం నుంచే గ్రామసచివాలయాల సిబ్బంది లబ్ధిదారుల ఇళ్ల వద్దకే చేరుకుని నేరుగా నగదును అందజేస్తారని ఆమె పేర్కొన్నారు. వృద్ధులు, దివ్యాంగులు మరియు వితంతువులు ఈ మార్పును గమనించి సహకరించాలని, పంపిణీ కార్యక్రమాన్ని వేగంగా పూర్తి చేసేందుకు సిబ్బందికి తగిన ఆదేశాలు జారీ చేశామని సీతామహాలక్ష్మి తెలిపారు లబ్ధిదారులందరికీ సకాలంలో ఆర్థిక సాయం అందాలనే లక్ష్యంతో రాష్ట్ర కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె స్పష్టం చేశారు.



## కార్గిల్ విక్టరీ పార్క్ పనులు వేగవంతం చేయాలి

- కార్గిల్ యుద్ధ సమాచారం అందరికి తెలిసేలా ఏర్పాటు చెయ్యాలి
- జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

-4లో

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# టీడీపీ నాయకుడు సుభాష్ మరణం పార్టీకి తీరని లోటు



టీడీపీ మండల నాయకుడు కొచ్చో కామరాజు.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జనవరి 28.**మండలంలో గల పనసపుట్టు పంచాయితీ, కడుతుల గ్రామనికి చెందిన గేమ్మెల సుభాష్ ఇటీవల అనారోగ్యంతో మరణించిన విషయం తెలిసిందే. సుభాస్ యొక్క పెద్దకర్మ బుదవారం జరిగాయి. ఈ సంస్మరణ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకుడు కొచ్చో కామరాజు పాల్గొని మాట్లాడుతూ.. టీడీపీ నాయకుడు సుభాష్ మరణం పార్టీకి తీరని లోటనీ అన్నారు. కుటుంబ సభ్యులకు ఎటువంటి కష్టాలు వచ్చిన పార్టీని ఆశ్రయించాలని, పార్టీ ఎప్పుడూ తోడుగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కడుతులలో జరిగిన సుభాస్ యొక్క సంస్మరణ కార్యక్రమంలో టీడీపీ, వైసిపి, బీజేపీ నేతలు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్తులు పాల్గొనీ సుభాస్ యొక్క చిత్రపటాని పూలమాలవేసి ఘన నివాళులర్పించారు.

## డ్రోన్ నిఘాతో బహిరంగ మద్యపానానికి అడ్డుకట్ట



**నాతవరం పరిధిలో నలుగురు అరెస్ట్**

**జిల్లా ఎస్పీ ఆదేశాలతో మరింత కఠిన పర్యవేక్షణ**

**అనకాపల్లి, పెన్ పవర్, జనవరి 28 :** స్థానిక అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెట్టేందుకు పోలీసులు ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నారు. ఇందులో భాగంగా డ్రోన్ కెమెరాల ద్వారా నిఘాను మరింత విస్తృతం చేస్తూ 'విజిబుల్ పోలీసింగ్'ను పకడ్బందీగా అమలు చేస్తున్నారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మరియు నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ పి.శ్రీనివాస రావు ఆదేశాల మేరకు నాతవరం, డి.యర్రవరం, జిల్లేడిపూడి ప్రాంతాల్లో ప్రత్యేక డ్రోన్ నిఘా నిర్వహించారు. ఈ తనిఖీల్లో బహిరంగంగా మద్యపానం చేస్తున్న నలుగురు వ్యక్తులు పోలీసుల కంట పడ్డారు.

నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్. రేవతమ్మ, నాతవరం ఎస్సై వై. తారకేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది డ్రోన్ సాయంతో డి.యర్రవరం శివారు ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. డ్రోన్ కెమెరాల ద్వారా కదలికలను గమనించిన పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారిపై సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా డ్రోన్ల వినియోగాన్ని మరింత పెంచాలని అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులకు సూచించినట్లు తెలిపారు. బహిరంగ మద్యపానం, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలపై నిరంతరం డ్రోన్ నిఘా కొనసాగుతుందని, నిబంధనలు అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

డ్రోన్ నిఘా వల్ల నేర నియంత్రణ మరింత ప్రభావవంతంగా మారుతోందని, ప్రజల భద్రతే లక్ష్యంగా పోలీసులు నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తున్నారని అధికారులు స్పష్టం చేశారు.



## ఈవీఎం గోదామును తనిఖీ చేసిన కలెక్టర్




**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, పార్వతీపురం జనవరి 28** : పట్టణ పరిధిలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ వద్ద గల ఈవీఎం గోదామును జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకరరెడ్డి తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీలో భాగంగా బుధవారం ఆయన గోదాములను సందర్శించి అక్కడ పరిస్థితిని గమనించారు. గోదాములకు వేసిన సీళ్లను, ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిష్టరులో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. గోదాముల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశిస్తూ, ఏర్పాట్లపై పరిశీలించి అధికారులకు పలు సూచనలు, మార్గదర్శకాలు జారీ చేశారు.
ఈ పర్యటనలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత, సబ్ కలెక్టర్ ఆర్. వైశాలి, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర బిజెపి ప్రభుత్వం తెచ్చిన నిరంకుశ చట్టాలను రద్దు చేయాలి

- ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలి
- జనవరి 30న ప్రతిజ్ఞలు చేయాలి
- సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.గోవిందరావు జిల్లా కమిటీ సభ్యులు నంబూరు షణ్ముఖరావు పిలిపు




**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ శ్రీకాకుళం జనవరి 28:** మోడీ ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన నిరంకుశ చట్టాలను రద్దుచేయాలంటూ ఈ నెల 30న కార్మికులంతా ప్రతిజ్ఞ చెయాలంటూ టెక్కలి సిపిఎం కార్యాలయంలో పిలుపునిచ్చారు. కొత్తగా వచ్చిన చట్టాలు, వి బి జి రాంజీ, విద్యుత్ చట్టాల సవరణ, లేబర్ కోడ్స్, సీడ్ బిల్లు, మినీ అణు విద్యుత్ ప్లాంట్ల వలన కార్పొరేట్ కంపెనీలకు లాభాలు తీసుకొస్తూ ప్రజలపై భారాలు పడతాయని తెలిపారు. నిరంకుశ చట్టాలను రద్దు చేయాలని కోరుతూ జనవరి 30న ప్రతీ గ్రామాల్లో ప్రతిజ్ఞలు, సంతకాల సేకరణ. ఫిబ్రవరి 2న సచివాలయాల కు వినతి పత్రాలు ఇవ్వాలని, ఫిబ్రవరి 5న అన్ని మండలాల్లో ధర్నాలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వి బి జీ రాంజీతో ప్రజలకు తీవ్ర హాని జరుగుతుందని, కేంద్రం తనకు నచ్చిన రాష్ట్రాలకు నిధులు ఇచ్చుకునే విధంగా చట్టంలో మార్పులు చేసిందని, పని దినాల్లోనూ కోత పెట్టిందని అన్నారు, చట్టం అమల్లోకి వస్తే రాష్ట్రాలు అప్పులు పాలు అవుతాయని, కొత్త పథకం వల్ల దేశంలో సామాజిక న్యాయం పూర్తిగా దెబ్బతిని దళితులు, పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. విద్యుత్ చట్టానికి సవరణలు చేయడం ద్వారా పేదలకు అందే క్రాస్ సబ్సిడీ రద్దవుతుందని, పేదలపై మోయలేని భారం పడుతుందని తెలిపారు. వీటితోపాటు ఏప్రిల్ ఒకటో తేదీ నుండి లేబర్ కోడ్లు అమల్లోకి వస్తాయని చెబుతున్నారని, దీనివల్ల కార్మికులకు కనీస హక్కులు తోపాటు సమ్మె హక్కు నూ కోల్పోతారని, ఎనిమిది గంటల పని విధానం రద్దు అవుతుందన్నారు. యూనియన్లు కోసం కార్మికులు పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కు లన్నీ నిర్వీర్యం అవుతాయని తెలిపారు. ప్రమాదకరమైన మినీ న్యూక్లియర్ ప్లాంట్లను విదేశీ వ్యక్తులు నేరుగా ఏర్పాటు చేసుకునేలా బిల్లు తెస్తున్నారని వాటిలో ప్రమాదం జరిగి నష్టం వాటిల్లితే దానికి వారు బాధ్యత వహించరని, ప్లాంటు రేడియేషన్ ప్రాణ నష్టానికి కూడా విదేశీ వ్యక్తుల బాధ్యతలేని విధంగా చట్టాలు ఉన్నాయని తెలిపారు, సీడ్ బిల్లు వల్ల మోన్ శాంటో, కార్గిల్ వంటి సంస్థలకు లాభాలు వస్తాయని, వ్యవసాయం దెబ్బతిని పోతుందని హెచ్చరించారు. ఇటువంటి చట్టాలను అత్యంత వేగంగా కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అమల్లోకి తెస్తుందని వీటిని సిపిఎం వ్యతిరేకిస్తున్నదని, ప్రజలను చైతన్యం చేసేందుకు పెద్ద ఎత్తున ప్రచారం చేస్తామని తెలిపారు. లేబర్ కోడ్స్ రద్దు చేయాలని ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సమ్మెకు సిపిఎం పార్టీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నదన్నారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు ఎప్పటిలోగా అమలు చేస్తారని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును ప్రశ్నించారు. జిల్లాలో ఐ టి డి ఎ ఏర్పాటు చేస్తామని, జీడికి గిట్టుబాటు ధర కల్పించి జీడి బోర్డు ఏర్పాటు చేస్తామని, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి ఇచ్ఛాపురం వరకు నీరు ఇస్తామని, వంశధార నిర్వాసితులకు ప్యాకేజీ ఇస్తామని అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్న నేటికీ అమలు చేయలేదని విమర్శించారు. వాగ్దానాలు అమలుకు ఉద్యమం చేస్తామని అన్నారు. జిల్లాలో బలవంతపు భూ సేకరణ ఆపాలని, నిర్బంధాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కె.యల్లయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలోసిపిఎం నాయకులు యు.లక్ష్మణరావు, హెచ్ ఈశ్వరరావు,బి.వాసుదేవరావు, ధర్మారావు తదితరులు మాట్లాడారు.

## గ్రూప్-2 పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన ఎంబి.పట్నం పంచాయతీ కార్యదర్శి.....

**నాతవరం,పెన్ పవర్ (జనవరి 28):** మండలం లో గల ఎంబి.పట్నం గ్రామంలో గ్రేడ్-3 పంచాయితీ కార్యదర్శి గా విధులు నిర్వహిస్తున్న వై. రమణ గ్రూప్-2 పరీక్షల్లో ప్రతిభ కనబరిచి విజయవాడలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (ఏఎస్ఓ) గా ఎంపిక కావడం జరిగింది.ప్రభుత్వ సేవలో ఉన్నత పదవికి ఎంపిక కావడం పట్ల గ్రామస్తులతో పాటు మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.వై.రమణ అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ గా ఎంపిక కావడం పట్ల మండల అభివృద్ధి అధికారి ఎం.సత్య శ్రీనివాస్ తో పాటు మండలంలో గల పలువురు పంచాయతీ కార్యదర్శులు అభినందించారు.కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవడం ఇతర ఉద్యోగులకు ఆదర్శంగా నిలుస్తుందని కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు.




# కార్గిల్ విక్టరీ పార్క్ పనులు వేగవంతం చేయాలి

- కార్గిల్ యుద్ధ సమాచారం అందరికి తెలిసేలా ఏర్పాటు చెయ్యాలి
- జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**స్టాఫ్ రిపోర్టర్ , పెన్ పవర్ శ్రీకాకుళం. జనవరి 28:** కార్గిల్ విక్టరీ పార్క్ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. కార్గిల్ విక్టరీ పార్క్ లో జరుగుతున్న పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ప్రవేశ ద్వారం బాగా తయారు చేయాలని, పార్క్ ను ప్రతీ ఒక్కరూ వినియోగించుకునే విధంగా ఉండాలనే ఉద్దేశంతో పార్క్ లో నిర్మితమవుతున్న రెండు బ్యాట్మింటన్ కోర్టులు, పికెల్ బాల్ కోర్ట్, బాక్స్ క్రికెట్ కోర్టు, క్రీడలకు పూర్తి స్థాయిలో వినియోగం అవ్వాలన్నారు. యోగా ప్లాట్ ఫారం (ఓపెన్ ఎయిర్ థియేటర్) ఈ థియేటర్ ను యోగా కు లేదా స్క్రీన్ పెట్టి సినిమా చూసుకునేలా తయారు చేయాలని తెలిపారు. గతంలో శిథిలావస్థలో ఉన్న లైబ్రరీని కూల్చివేసి కొత్త భవనాన్ని (రీడింగ్ రూంగా) నిర్మించిన్నామని, అదే భవనానికి పక్కనే మెడిటేషన్ (ధ్యానం) చేసుకొనే విధంగా తీర్చిదిద్దాలని, పార్క్ లో కాఫీ షాపు కూడా ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఓపెన్ ఎయిర్ థియేటర్ కు వెనుక భాగంలో కార్గిల్ చరిత్ర ఏర్పాటుకు సైనిక సంక్షేమ అసోషియేషన్ నుండి ఒక కమిటీ ఏర్పాటు చేసి కార్గిల్ కు సంబంధించి ఒక చరిత్రను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా సైనిక సంక్షేమ అధికారి శైలజను ఆదేశించారు. సందర్శకులు ఎవరైనా పార్క్ కు వస్తే కార్గిల్ యుద్ధం ఎప్పుడు ప్రారంభం అయింది.. ఎప్పుడు అంతం అయిందనే విషయాలను, తదితరమైన సమాచారం ఉండాలన్నారు. పార్క్ లో జరుగుతున్న ప్రతీ ఒక్క పనులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. వాటర్



ట్యాంక్ వద్ద ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో చూపించాలని డిఈని ఆదేశించారు. ఇప్పుడు చేసే పనులు శాశ్వతంగా దండాలని, ఎవరు వచ్చిన సునాయాసంగా పనులు చేసుకొనే విధంగా ఉండాలని, పార్క్ పనులు సత్వరమే పూర్తి చేసి అందించాలని చెప్పారు. పార్కులో టాయిలెట్స్ కంటైనర్ మోడల్లో వస్తుందని సెవెన్ హిల్స్ అసోషియేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వంశీకృష్ణ కలెక్టర్ కు వివరించారు. ఈ పర్యటనలో సైనిక సంక్షేమ అధికారి శైలజ, సెవెన్ హిల్స్ అసోషియేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వంశీకృష్ణ, మున్సిపల్ కార్పొరేషన్ కు సంబంధించి తాగునీరుకి సంబంధించి డిఈ, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## 10 కోట్లతో శ్రీకూర్మాం ఆలయ అభివృద్ధికి ప్రణాళిక





- తొలి విడతగా 3 కోట్లు విడుదల చేసిన ఇండిగో సంస్థ
- ఆర్కిటెక్ట్లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎమ్మెల్యే గొండు శంకర్

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ శ్రీకూర్మం జనవరి 28 :**ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కూర్మనాథ స్వామి ఆలయ అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చొరవతో, ప్రముఖ విమానయాన సంస్థ 'ఇండిగో' తన సామాజిక బాధ్యత నిధులతో ఈ క్షేత్రాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు ముందుకు వచ్చింది. బుధవారం శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, ఇండిగో సంస్థ ప్రతినిధులు, ఆర్కిటెక్ట్లతో కలిసి ఆలయ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు.
ఆలయ అభివృద్ధి కోసం మొత్తం రూ. 10 కోట్ల వ్యయంతో సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇందులో భాగంగా మొదటి విడతగా రూ.3 కోట్లను ఇండిగో సంస్థ విడుదల చేసిందని, దశలవారీగా మిగిలిన నిధులు అందుతాయని ఆయన పేర్కొన్నారు. శ్వేత పుష్కరిణి అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, భక్తుల వసతులే లక్ష్యంగా ఈ పనులు సాగనున్నాయి.
వచ్చే 30 ఏళ్ల భవిష్యత్తు అవసరాలను, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నారు. శ్వేత పుష్కరిణి గట్టుపై ఉన్న ఆక్రమణలను తొలగించి, అక్కడ ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడేలా అభివృద్ధి చేస్తారు. ఆలయ వైభవం ప్రతిబింబించేలా ప్రధాన ముఖద్వారాన్ని నిర్మించనున్నారు. పనుల నాణ్యత, డిజైన్లపై జలవనరుల శాఖ ఇంజనీర్లు, ఆర్కిటెక్ట్లతో ఎమ్మెల్యే ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్, స్థానిక సచివాలయ సిబ్బంది, జలవనరుల శాఖ అధికారులు, ఆలయ ధర్మకర్తలు, గ్రామ పెద్దలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## సింహాద్రి అప్పన్న సన్నిధిలో టీమిండియా తారలు





సింహాచలంలో ఘనంగా జరిగిన ప్రత్యేక దర్శనం

**సింహాచలం, పెన్ పవర్, జనవరి 28** : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ వరాహలక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానం, సింహాచలం శ్రీవారి సన్నిధి బుధవారం ప్రత్యేక ఆధ్యాత్మిక సందడితో కళకళలాడింది. భారత క్రికెట్ జట్టుకు చెందిన ప్రముఖులు, క్రికెట్ దిగ్గజాలు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.
భారత క్రికెట్ జట్టు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్, యువ స్పిన్నర్ రవి బిష్ణోయ్‌లు శ్రీవారిని దర్శించుకున్నారు. వీరితో పాటు టీమిండియా ఫీల్డింగ్ కోచ్ దిలీప్, మాజీ టీమిండియా మేనేజర్ పులపర్తి వెంకటరామ్ ప్రశాంత్, అపెక్స్ మెంబర్ విష్ణుదంతు, ఏసీపి (సెలెక్ట్) ఆర్.వి. నాగరాజన్ కూడా ఈ ఆధ్యాత్మిక పర్యటనలో పాల్గొన్నారు.
భీమిలి నియోజకవర్గ శాసనసభ్యులు, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక దర్శనం ఘనంగా నిర్వహించబడింది. ఆలయ సంప్రదాయాల ప్రకారం తొలుత క్రికెటర్లు కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం నాదస్వర వాయిద్యాలు, వేదమంత్రోచ్చారణల నడుమ వేద పండితులు వారికి పూర్ణకుంభ స్వాగతం పలికారు.
ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్.సుజాత ఆదేశాల మేరకు, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షణాధికారి కె.వెంకటేశ్వరరావు నేతృత్వంలో దర్శన ఏర్పాట్లు సక్రమంగా నిర్వహించబడ్డాయి. ఆలయ అధికారులు క్రికెట్ జట్టు సభ్యులకు ఘన స్వాగతం పలికారు.
దర్శనానంతరం వేద పండితులు అతిథులకు వేద ఆశీర్వచనం అందజేశారు. స్వామివారి శేష వస్త్రంతో గౌరవపూర్వకంగా సత్కరించి, ఆలయ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా గౌతమ్ గంభీర్, సూర్యకుమార్ యాదవ్‌లు సింహాద్రి అప్పన్న సన్నిధిలో గడిపిన ఆధ్యాత్మిక క్షణాలు తమకు ఎంతో శాంతిని, ఆత్మవిశ్వాసాన్ని అందించాయని తెలిపారు.
దేశం తరఫున ఆడే క్రీడాకారులకు స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని అర్చకులు ఆకాంక్షించారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ పర్యటనతో సింహాచల క్షేత్రం ప్రత్యేక ఆకర్షణగా మారి, భక్తులతో పాటు అభిమానుల్లోనూ ఉత్సాహాన్ని నింపింది.



## బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కేసులు నమోదు...


ఎస్సై వై.తారకేశ్వరరావు....

**నాతవరం,పెన్ పవర్ (జనవరి 28):** బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కేసులు నమోదు చేస్తామని స్థానిక ఎస్సై వై.తారకేశ్వరరావు తెలియజేశారు. బుధవారం మండలంలో గల నాతవరం, జిల్లేడు పూడి,డి.ఎర్రవరం గ్రామ పరిసర ప్రాంతాల్లో జిల్లా ఎస్పీ తుహీన్



సిన్హా,నర్సీపట్నం డి.ఎస్.పి శ్రీనివాసరావు ఉత్తర్వులు మేరకు నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ పర్యవేక్షణలో డ్రోన్ కెమెరాతో నిఘా పట్టి నలుగురు వ్యక్తులను బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిని పట్టుకొని, వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు పంపడం జరిగిందని ఎస్సై తెలిపారు.

## గ్రూప్2లో హుకుంపేట యువకుడి ఘన విజయం



**హుకుంపేట,పెన్ పవర్,జనవరి 28:**అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం మత్స్యపురం పంచాయతీ ఉప్ప బైరోడి వలస గ్రామానికి చెందిన పెనుమాల గుణశేఖర్ గ్రూప్2 పరీక్షల్లో ఘన విజయం సాధించారు. ఆంధ్రప్రదేశ్ గ్రూప్2 ఫలితాల్లో ఆయన ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్గా నియామకానికి ఎంపికయ్యారు.ఆంధ్రప్రదేశ్ జోన్1 నుంచి మొదటి స్థానంలో నిలిచి విశేష ప్రతిభ చూపిన గుణశేఖర్ విజయం గ్రామస్తుల్లో గర్వకారణంగా మారింది. గుణశేఖర్ తండ్రి పెనుమాల లింగమూర్తి విశాఖపట్నం పోర్టు ట్రస్టులో ఉద్యోగిగా పనిచేస్తుండగా, తల్లి శశిరేఖ గృహిణి. ఆయన విజయం పట్ల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామ పెద్దలు, యువత గుణశేఖర్‌ను అభినందించారు.

## అనకాపల్లి ఉత్సవాలను విజయవంతం చేయాలి.....

- మండల అభివృద్ధి అధికారి ఎం.సత్య శ్రీనివాస్.....



**నాతవరం,పెన్ పవర్ (జనవరి 28):** ఈ నెల 30,31 తేదీల్లో జరగనున్న అనకాపల్లి ఉత్సవాలను ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని నాతవరం మండల అభివృద్ధి అధికారి ఎం.సత్య శ్రీనివాస్ పిలుపునిచ్చారు.బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తోందన్నారు.ఉత్సవాల్లో భాగంగా అనకాపల్లి బెల్లం మార్కెట్లో పుష్ప ప్రదర్శన, ఎన్టీఆర్ గ్రౌండ్స్ లో గాయని సునీత ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.అలాగే అచ్యుతాపురం మండలం కొండకర్ల ఆవలో ప్రత్యేక బోట్లతో బోట్ షికార్,పరవాడ మండలం ముత్యాలపాలెం బీచ్ వద్ద కబడ్డీ,వాలీబాల్ పోటీలు జరుగుతాయని తెలిపారు.గాయని గీతా మాధురి ప్రత్యేక కార్యక్రమం కూడా ఉంటుందన్నారు. మండలంలోని 31 పంచాయతీల ప్రజలు, ఉద్యోగులు,నాయకులు ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# గంజాయి అక్రమ రవాణాపై కఠిన తీర్పు

- నలుగురు నిందితులకు 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.లక్ష జరిమానా
- చోడవరం కోర్టు చారిత్రాత్మక తీర్పు



**అనకాపల్లి (కొత్తకోట), పెన్ పవర్, జనవరి 28 :**
గంజాయి అక్రమ రవాణాపై అనకాపల్లి జిల్లా తొమ్మిదవ అదనపు జిల్లా కోర్టు (చోడవరం) కీలక తీర్పును వెలువరించింది. 80 కేజీల గంజాయిని అక్రమంగా తరలించిన కేసులో నలుగురు నిందితులకు పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.1లక్ష జరిమానా విధిస్తూ గౌరవ న్యాయమూర్తి ఎం. హరినారాయణ తీర్పునిచ్చారు. 2017 జనవరి 8వ తేదీ ఉదయం కొత్తకోట పోలీస్ స్టేషన్ పరిధిలోని దొండపూడి చెక్ గేట్ వద్ద రెండు మోటార్ సైకిళ్లపై గంజాయిని అక్రమంగా తరలిస్తున్న నిందితులను పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసును అప్పటి ఎస్సై డి. శేఖరం సమర్థవంతంగా దర్యాప్తు చేసి, పక్కా ఆధారాలతో కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు.
కోర్టులో జరిగిన విచారణలో నిందితులపై మోపబడిన నేరం రుజువవడంతో, పెంట శ్రీనివాసరావు (ఏ1), వలబుల నూకరాజు ఏ చిన్నబ్బాయి (ఏ3), సుర్ల రమణ (ఏ4), కర్రి రామారావు (ఏ5)లకు ఈ శిక్ష విధించబడింది. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఏడాది సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని కోర్టు స్పష్టం చేసింది. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున సమర్థవంతంగా వాదనలు వినిపించిన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ చీపురపల్లి సూర్యనారాయణని, అలాగే కేసును పకడ్బందీగా దర్యాప్తు చేసిన అధికారులు, కొత్తకోట పోలీస్ సిబ్బంది, కోర్టు మానిటరింగ్ సెల్ సిబ్బందిని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ప్రత్యేకంగా అభినందించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు పాల్పడే వారిపై చట్టపరంగా అత్యంత కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ హెచ్చరించారు.


02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు'
'పొ. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి


## ఘనంగా ముగిసిన విశాఖ శ్రీ శారదా పీఠం వార్షిక మహోత్సవాలు


- రాజశ్యామల యాగ మహా పూర్ణాహుతితో పరిపూర్ణత





**పెందుర్తి, పెన్ పవర్, జనవరి 28 :** విశాఖ నగరంలోని ప్రసిద్ధ ఆధ్యాత్మిక కేంద్రం శ్రీ శారదా పీఠంలో నిర్వహించిన వార్షిక మహోత్సవాలు భక్తుల సందడితో, దైవానుభూతులతో ఘనంగా ముగిశాయి. శ్రీ శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారి అనుగ్రహార్థం నాలుగు రోజుల పాటు కఠిన నియమాలు, నిష్టలతో నిర్వహించిన రాజశ్యామల మహాయాగం, మహా పూర్ణాహుతితో శుభప్రదంగా ముగిసింది.
ఈ పవిత్ర కార్యక్రమంలో ఉత్తర పీఠాధిపతులు శ్రీ స్వాత్మానందేంద్రసరస్వతీస్వామివారు స్వయంగా హోమగుండంలో పూర్ణాహుతి ద్రవ్యాలను సమర్పించి యాగాన్ని సంపూర్ణం చేశారు. అనంతరం స్వామివారు మాట్లాడుతూ, ఈ యాగం ద్వారా లోక కల్యాణం, సమాజ శాంతి, వ్యక్తిగత శ్రేయస్సు, కుటుంబ సౌఖ్యం, ఆరోగ్యం, ఐశ్వర్యం, విద్యలో పురోగతి, ఉద్యోగ, వ్యాపార అభివృద్ధి వంటి సకల శుభఫలితాలు కలుగుతాయని తెలిపారు.
లక్ష సార్లు మూలమంత్ర పఠనంతో విశేష శక్తి..
శ్రీ శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారి మూల మంత్రాన్ని శత సహస్ర (లక్ష) సార్లు పఠిస్తూ ఈ యాగాన్ని నిర్వహించడం విశేష ఆకర్షణగా నిలిచింది. భక్తుల మనోకాంక్షలు నెరవేర్చే అపూర్వ ఆధ్యాత్మిక శక్తి ఈ యాగంలో నిక్షిప్తమై ఉందని స్వామివారు వివరించారు.
యాగశాల ప్రదక్షిణలతో ఆధ్యాత్మిక వైభవం
యాగ మహోత్సవంలో భాగంగా భక్తులు యాగశాల చుట్టూ భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ప్రదక్షిణలు ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా నిలిచాయి. యాగాగ్ని సాక్షిగా నిశ్చల భక్తితో చేసిన ఈ ప్రదక్షిణల వల్ల పూర్వజన్మ పాపక్షయం, గ్రహదోష నివారణ, మానసిక అశాంతి తొలగింపు, కుటుంబ కలహాల నివారణ
సంతాన, విద్య, ఉద్యోగ, ఆర్థిక అడ్డంకుల తొలగింపు సాధ్యమవుతాయని స్వామివారు తెలిపారు. అంతేకాక భక్తులలో ఆత్మబలం పెరిగి, ఆధ్యాత్మిక చైతన్యం మరింత వృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.
భక్తులకు దివ్యానుభూతి..
సాక్షాత్తు అమ్మవారే కొలువై ఉన్న విశాఖ శ్రీ శారదా పీఠంలో ప్రతి సంవత్సరం నిర్వహించే ఈ వార్షిక మహోత్సవాలు భక్తులకు అపూర్వమైన దైవానుభూతిని ప్రసాదిస్తున్నాయని స్వామివారు అన్నారు. పీఠాధిపతులు శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామివారి ఆశీస్సులు, శ్రీ శారదా అమ్మవారి అనుగ్రహం భక్తులందరిపై సదా నిలిచేలా దీవించారు.
జీవితాంతం గుర్తుండిపోయే అనుభవం
యాగ ఫలితాలు, ప్రదక్షిణల ద్వారా లభించిన ఆధ్యాత్మిక శక్తిని ప్రత్యక్షంగా అనుభవించామని భక్తులు తెలిపారు. ఈ వార్షిక మహోత్సవాలు తమ జీవితాల్లో శాంతి, విశ్వాసం, సానుకూల మార్పులను తీసుకొచ్చాయని, జీవితాంతం గుర్తుండిపోయే దివ్య అనుభూతిగా నిలిచాయని వారు ఆనందం వ్యక్తం చేశారు.

## శ్రీ స్వామివారిని దర్శించుకున్న రాష్ట్ర ఉప లోకాయుక్త పి.రజని






మంగళ వాయిద్యాల నడుమ ఘన స్వాగతం
శాస్త్రోక్తంగా స్వామివారి పూజలు

**సింహాచలం, పెన్ పవర్, జనవరి 28 :** సింహగిరిపై కొలువై ఉన్న శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామివారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌరవ ఉపలోకాయుక్త మరియు ఇంచార్జ్ లోకాయుక్త పి.రజని బుధవారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. అధికారిక ప్రోటోకాల్ పర్యటనలో భాగంగా ఆమె సింహాచలం క్షేత్రానికి విచ్చేయగా, ఆలయ అధికారులు మరియు అర్చకులు సంప్రదాయబద్ధంగా ఘన స్వాగతం పలికారు. ఆలయ రాజగోపురం వద్ద గౌరవ ఉపలోకాయుక్తకు దేవస్థానం సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు స్వాగతం పలికారు. అనంతరం నాదస్వర మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛారణల నడుమ ఆమెను ఆలయ ప్రాంగణంలోకి తీసుకువెళ్లారు. దర్శన క్రమంలో భాగంగా ఆలయ సంప్రదాయం ప్రకారం భక్తుల కోర్కెలు తీర్చే కప్పస్తంభాన్ని ఉపలోకాయుక్త భక్తిశ్రద్ధలతో ఆలింగనం చేసుకున్నారు.
అనంతరం గర్భాలయంలో కొలువై ఉన్న కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం ఆలయ మండపంలో వేద పండితులు ఆమెకు వేదాశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి శ్రీ కె. తిరుమలేశ్వరరావు స్వామివారి శేష వస్త్రంతో ఆమెను సత్కరించి, తీర్థ ప్రసాదాలు మరియు స్వామివారి చిత్రపటాన్ని జ్ఞాపికగా అందజేశారు.
స్వామివారి దర్శనం అనంతరం ఉపలోకాయుక్త పి.రజని మాట్లాడుతూ, సింహాచల క్షేత్ర పవిత్రత, ప్రశాంతమైన ఆధ్యాత్మిక వాతావరణం తనను ఎంతో ఆకట్టుకున్నాయని తెలిపారు. ఈ క్షేత్రం భక్తులకు ఆధ్యాత్మిక శక్తిని, మనోశాంతిని ప్రసాదించే దివ్య స్థలమని కొనియాడారు.
ఈ కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి కె. వెంకటేశ్వరరావు, డెప్యూటీ డైరెక్టర్ (ఇన్వెస్టిగేషన్) వై.గోవిందరావు, ఆలయ అధికారులు, అర్చక స్వాములు, ప్రోటోకాల్ అధికారులు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## సింహాచలం అప్పన్న హుండీ ఆదాయం లెక్కింపు పూర్తి

- 21 రోజుల్లో రూ.1.85 కోట్లకు పైగా ఆదాయం





**సింహాచలం, పెన్ పవర్, జనవరి 28 :**
విశాఖపట్టణంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వరాహలక్ష్మీ నరసింహస్వామివారి దేవస్థానం, సింహాచలంలో హుండీ ఆదాయం లెక్కింపు కార్యక్రమం బుధవారం పారదర్శకంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎన్.సుజాత, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సింగం రాధతో పాటు దేవాదాయ శాఖకు చెందిన అధికారులు పర్యవేక్షించారు. గత 21 రోజుల కాలానికి (జనవరి 07 నుండి జనవరి 28 వరకు) భక్తులు హుండీలో సమర్పించిన కానుకలను అధికారులు లెక్కించారు. ఈ కాలంలో భక్తుల నుండి మొత్తం రూ.1,85,15,811 నగదు ఆదాయం సమకూరినట్లు దేవస్థానం అధికారులు వెల్లడించారు. భారతీయ కరెన్సీ నోట్ల రూపంలో రూ.1,74,13,815, నాణేల రూపంలో రూ.11,01,996 లభించాయి. దీంతో మొత్తం నగదు ఆదాయం కోటి ఎనభై ఐదు లక్షల పదిహేను వేల ఎనిమిది వందల పదకొండు రూపాయలుగా నమోదైంది. రోజువారీ సగటు హుండీ ఆదాయం సుమారు రూ.8,81,705గా ఉన్నట్లు అధికారులు తెలిపారు.
అలాగే భక్తులు మొక్కుబడుల రూపంలో సమర్పించిన విలువైన లోహాల వివరాలను కూడా లెక్కించారు. ఈ 21 రోజుల్లో బంగారం 55 గ్రాముల 500 మిల్లీగ్రాములు, వెండి 6 కిలోల 140 గ్రాములు లభించినట్లు వెల్లడించారు. దేశ విదేశాల నుంచి సింహాచలం అప్పన్న దర్శనానికి వచ్చిన భక్తులు విదేశీ కరెన్సీని కూడా హుండీలో సమర్పించారు. ముఖ్యంగా అమెరికా నుంచి 174 డాలర్లు, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నుంచి 295 దిర్హామ్స్, సౌదీ అరేబియా నుంచి 110 రియాల్స్, కువైట్ నుంచి 6.75 దినార్లు లభించాయి. ఇవే కాకుండా సింగపూర్, మలేషియా, ఆస్ట్రేలియా, నేపాల్, ఓమన్, ఖతార్, నైజీరియా, వియత్నాం దేశాలకు చెందిన కరెన్సీ నోట్లు కూడా హుండీలో లభించినట్లు అధికారులు తెలిపారు.
హుండీ లెక్కింపు కార్యక్రమం మొత్తం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య, సీసీటీవీ నిఘా నీడలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో దేవస్థాన అధికారులు, సిబ్బంది, అలాగే బ్యాంక్ ప్రతినిధులు పాల్గొన్నారు. భక్తుల విశ్వాసాన్ని నిలబెట్టేలా పూర్తి పారదర్శకతతో ఈ లెక్కింపు ప్రక్రియను నిర్వహించినట్లు దేవస్థానం అధికారులు స్పష్టం చేశారు.

## ప్రభుత్వ భూములపై రాజకీయ దుమారం





గీతం రెగ్యులరైజేషన్‌కు వ్యతిరేకంగా వైయస్సార్సీపీ వినతి

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, జనవరి 28 :** విశాఖపట్నంలో రూ.5 వేల కోట్ల విలువైన 54.79 ఎకరాల ప్రభుత్వ భూమిని గీతం విద్యా సంస్థలకు రెగ్యులరైజ్ చేయాలన్న ప్రతిపాద నను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు తీవ్రంగా స్పం దించారు. ఈ మేరకు శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆధ్వర్యంలో వైయస్సా ర్సీపీ నేతలు జీవీఎంసీ కమిషనర్, మేయర్‌లకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కే.కే. రాజు, ఎమ్మెల్సీలు కుంభా రవిబాబు సహా పలు వురు కార్పొరేటర్లు, పార్టీ నేతలు పాల్గొన్నారు. అనంతరం బొత్స సత్యనారాయణ, కే.కే. రాజు మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.
భూదోపిడీకి ప్రభుత్వం అండ బొత్స ఆరోపణలు
విశాఖలో సీఎం చంద్రబాబు నాయుడు కుటుంబం భూదోపిడీకి పాల్పడుతోందని బొత్స సత్యనారాయణ ఆరోపించారు. లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తున్న గీతం విద్యాసంస్థలు ప్రభుత్వ భూమిని కబ్జా చేసి, దానిని రెగ్యులరైజ్ చేయించుకునే ప్రయత్నం చేయడం దుర్మార్గమని వ్యాఖ్యానించారు. ఈ నెల 30న జరగనున్న జీవీఎంసీ కౌన్సిల్ సమా వేశ అజెండాలో ఈ ప్రతిపాదనను చేర్చవద్దని అధికారులను కోరినట్లు తెలిపారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే రాజకీయ పార్టీలు, మేధావులతో కలిసి ఉద్యమాన్ని ఉధృ తం చేస్తామని హెచ్చరించారు. గీతం సంస్థల ఆక్రమణలో ఉన్న భూములను స్వయంగా పరిశీలించనున్నట్లు వెల్లడించారు. కూటమి పార్టీల వైఖరి చెప్పాలి ఈ భూదోపిడీపై కూటమిలో భాగస్వామ్యులైన బీజేపీ, జనసేన పార్టీలు స్పష్టమైన వైఖరి వెల్లడించాలని బొత్స డిమాండ్ చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యా ణ్ ఈ అంశంపై సమాధానం చెప్పాలని ప్రశ్నిం చారు. "స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అంటే ప్రభుత్వ భూములు దోచుకోవడమేనా?" అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సిట్‌ను తిరిగి ప్రారంభించాలి
విశాఖ భూదోపిడీలపై గతంలో ఏర్పాటు చేసిన సిట్‌ను మళ్లీ ఓపెన్ చేసి వాస్తవాలను వెలుగు లోకి తీసుకురావాలని బొత్స డిమాండ్ చేశారు. పేదల చిన్న ఆక్రమణలను రెగ్యులరైజ్ చేయడం ఒక విషయం అయితే, వేల కోట్ల విలువైన ప్రభు త్వ భూమిని రాజకీయ ప్రభావంతో రెగ్యులరైజ్ చేయడం అన్యాయమని అన్నారు.
కే.కే. రాజు విమర్శలు
వైయస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు కే.కే. రాజు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ గీతం యూనివ ర్సిటీకి వేల కోట్ల విలువైన భూములు కట్టబెడు తోందని ఆరోపించారు. జీవీఎంసీ కౌన్సిల్ అజెం డాలోని ఈ ప్రతిపాదనను వెంటనే తొలగించాల ని డిమాండ్ చేశారు. విశాఖలో జరుగుతున్న భూదోపిడీపై మేధావులు, ప్రజలు ఆలోచించాల ని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, డిప్యూటీ మేయర్‌లు, కార్పొరేట ర్లు, కో–ఆప్షన్ సభ్యులు, పార్టీ నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## మారుమూల పల్లె నుంచి రాష్ట్ర స్థాయి కొలువుకు రెడ్డి విజయలక్ష్మి



**గూడెం కొత్త వీధి, పెన్ పవర్, జనవరి 28:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం దారకొండ గ్రామానికి చెందిన గిరిజన యువతి రెడ్డి విజయశాంతి గ్రూప్2 ఫలితాల్లో సత్తా చాటి రాష్ట్ర స్థాయి ఉద్యోగానికి ఎంపికయ్యారు. గ్రూప్2 పరీక్షల్లో ఆమె అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (ఏఎస్ఓ)గా నియామకానికి అర్హత సాధించి, తన ప్రతిభను చాటుకున్నారు. ప్రస్తుతం చింతపల్లి మండలం చౌడుపల్లి పంచాయతీలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న విజయశాంతి, కష్టపడి చదివి ఈ స్థాయి విజయం సాధించడం పట్ల సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. విజయశాంతి తండ్రి రెడ్డి ధర్మయ్య గూడెం కొత్త వీధి మండల తహసీల్దార్ కార్యాలయంలో ఓఎస్‌గా విధులు నిర్వహిస్తుండగా, తల్లి సావిత్రి గృహిణి. మారుమూల గిరిజన గ్రామం నుంచి పంచాయతీ కార్యదర్శి స్థాయి ఉద్యోగం సాధించి, ఇప్పుడు రాష్ట్ర స్థాయి ఉన్నత ఉద్యోగానికి ఎంపిక కావడం యువతకు ఆదర్శంగా నిలుస్తోంది. ఆమె విజయంపై కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# నడింపాలెం- ఎం మాకవరం రోడ్డు నిర్మించండి మహాప్రభో...!

* మూడవరోజు కొనసాగిన గిరిజనుల నిరసన దీక్ష




**కొయ్యూరు, పెన్ పవర్ జనవరి 28:**మండలంలోని నడింపాలెం ఎం. మాకవరం రహదారి దుస్థితికి వ్యతిరేకంగా భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు మూడవ రోజూ ఉధృతంగా కొనసాగుతున్నాయి. ప్రజల కష్టాలు పట్టించుకోకుండా అధికార యంత్రాంగం మొద్దు నిద్రలో మునిగిపోయిందని ఆరోపిస్తూ గిరిజనులు రోడ్డెక్కి పోరాటానికి దిగారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ

స్వాతంత్ర్యం వచ్చి77 ఏళ్ల గడిచినా గిరిజన ప్రాంతాల్లో కనీస మౌలిక వసతులు లేని దుస్థితి ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం అని మండిపడ్డారు.

నడింపాలెంఎం మాకవరం రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో పాఠశాల విద్యార్థులు, గర్భిణీ మహిళలు, రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వర్షాకాలంలో ఈ రహదారి పూర్తిగా చిత్తడిగా మారి గ్రామస్తులు ప్రాణాలను పణంగా పెట్టి ప్రయాణించాల్సిన పరిస్థితి ఉందని, ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా ఇప్పటికీ స్పష్టమైన చర్యలు లేకపోవడం దారుణమని సిపిఐ నేతలు విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేసి తక్షణమే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేదంటే నిరసన ఉద్యమాన్ని మరింత విస్తరించి మండల కేంద్రాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఈ నిరసనకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సంఘీభావం ప్రకటించారు. మండల అధ్యక్షులు బిడిజన అప్పారావు, జల్లి బాబులుతో పాటు పలువురు వైసీపీ నాయకులు దీక్షా శిబిరాన్ని సందర్శించి రహదారి సమస్యపై తమ మద్దతు ప్రకటించారు. ప్రజా సమస్యలపై పార్టీలకు అతీతంగా పోరాడాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. మూడవ రోజూ కొనసాగుతున్న ఈ నిరసన దీక్షలో నడింపాలెం, ఎం మాకవరం గ్రామాలకు చెందిన ప్రజలు, వైసీపీ నాయకులు, సర్పంచ్ ఎంపీటీసీ పెద్ద సంఖ్యలో పాల్గొని "రోడ్డు మా హక్కు", "గిరిజనులను విస్మరించొద్దు" అంటూ నినాదాలు చేశారు.

ప్రభుత్వం స్పందించే వరకు పోరాటం ఆగదని, అవసరమైతే ఉద్యమాన్ని జిల్లా స్థాయికి తీసుకెళ్తామని సిపిఐ నాయకులు స్పష్టం చేశారు.

# వార్డు లో కరెంటు సమస్యలపై వినతి పత్రం



**గాజువాక : పెన్ పవర్, జనవరి 28:**జీవీఎంసీ 87వ వార్డు పరిధిలో కరెంటు సమస్యలపై వినత పత్రం అందజేశారు .వైయస్ఆర్సీపీ అధ్యక్షుడు ఆధ్వర్యంలో వడ్లపూడి ఆర్ హెచ్ కాలనీ. 87 వార్డు పరిధిలోని గవర వీధి సిడబ్ల్యూసీ సెంటర్లో కరెంట్ పోల్ రోడ్డు మధ్యలో ఉండటం వల్ల ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది కావున దాని పక్కకు షిఫ్ట్ చేయవలసిందిగా కోరుతూ మరియు వార్డ్ లో ఉన్న ట్రాన్స్ఫార్మాలు రక్షణ ఫెన్సింగ్ వేయవలసిందిగా కోరుచూ అలాగే లో వోల్టేజ్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని వడ్లపూడి సబ్టేషన్ ఏఈ కి వినపత్రం అందజేశారు .ఏఈ మాట్లాడుతూ త్వరలోనే పోల్ షిఫ్టింగ్ మరియు రక్షణ ఫెన్సింగ్ వేయడానికి పై అధికారులతో చర్చించి చేస్తానని అలాగే వేసవికాలం వస్తుంది కాబట్టి ముందు జాగ్రత్తగా లో వోల్టేజ్ సమస్యను తీర్చేస్తామన అన్నారు, వార్డ్ అధ్యక్షుడు బొడ్డ గోవిందా, చిత్రాడ వెంకటరమణ , ప్రగడ శ్రీనివాస్, ముద్దపు దామోదర్,దుగ్గపు దానప్పలు, గున్న రామారావు, దాకా సత్తిబాబు,తదితరులు పాల్గొన్నారు వడ్లపూడి ఆర్ హెచ్ కాలనీ. 87 వార్డు పరిధిలోని గవర వీధి సిడబ్ల్యూసీ సెంటర్లో కరెంట్ పోల్ రోడ్డు మధ్యలో ఉండటం వల్ల ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది కావున దాని పక్కకు షిఫ్ట్ చేయవలసిందిగా కోరుతూ మరియు వార్డ్ లో ఉన్న ట్రాన్స్ఫార్మాలు రక్షణ ఫెన్సింగ్ వేయవలసిందిగా కోరుచూ అలాగే లో వోల్టేజ్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని వడ్లపూడి సబ్టేషన్ ఏఈ కి వినపత్రం అందజేశారు.

# 40 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న సిసి రోడ్లు, కలవర్టుకు శంకుస్థాపన....



**నాతవరం,పెన్ పవర్ (జనవరి 28):** స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు చొరవతో ఎంబీ.పట్నం గ్రామంలో సుమారు 40 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న సిసి రోడ్లు,కలవర్టుకు మాజీ ఎంపీటీసీ రెడ్డి ఎర్రయమ్మ చేతుల మీదుగా బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నాయకులు కిల్లాడి నూకరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామాలు అభివృద్ధి పదంలో నడుస్తున్నాయని అన్నారు. శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు చొరవతో గ్రామంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు జరిగేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్జోగి వెంకటరమణ, కుసిరెడ్డి అప్పుల నాయుడు,ఎన్. బాబులు, పల్లి వరహాలు, సంగంపల్లి జయబాబు, జీవి రెడ్డి బుజ్జి,టిడిపి అభిమానులు పాల్గొన్నారు.

# ఆదివాసీ స్పెషల్ ఙూజ సాధన కమిటీ.



* ఆదివాసీ నిరుద్యోగుల సంఘం
* ఏజెన్సీ ఆదివాసీ లకు నూరు శాతం రిజర్వేషన్ హామీ అమలు పై సీఎం స్పష్టత ఇవ్వాలి.
* సిఎం స్పందించకుంటే ఉద్యమం తీవ్రతరం.

**పాడేరు, పెన్ పవర్, జనవరి 28:**స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్.

ఐటిడిఎ వద్ద ఆదివాసీ డీఎస్సీ అభ్యర్థుల 24 గంటల నిరసన దీక్ష ప్రారంభం

24 గంటల నిరసన దీక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆదివాసీ నేత అప్పలనర్స

జిఓ-3 రిజర్వేషన్ అమలు, స్పెషల్ ఙూజ పై సిఎం చంద్రబాబు నాయుడు హామీని అమలు పై స్పష్టత ఇవ్వాలని, గిరిజన నిరుద్యోగుల కోసం ప్రత్యేక డిఎస్సి ప్రకటించాలని ఆదివాసి నిరుద్యోగులు, ప్రత్యేక డీఎస్సీ సాధన కమిటీ ముఖ్య సలహా దారులు పి. అప్పల నరస రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

. ఆదివాసీలకు చెందిన షెడ్యూల్డ్ ఏరియా ఉద్యోగ నియామకాల్లో జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ పాడేరు జిల్లా కేంద్రం లో ఆదివాసీ నిరుద్యోగుల సంఘం, ఆదివాసీ ప్రత్యేక డిఎస్సీ సాధన కమిటీ ఆధ్వర్యంలో అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు ఐటిడిఎ గేటు ఎదుట బుధవారం 24 గంటల నిరసన దీక్ష ను పి. అప్పల నరస ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ 100% ఉద్యోగ రిజర్వేషన్ తక్షణమే అమలు పై ఆర్డినెన్స్ జారీ చేయాలని, 2026 మెగా ఙూజ లో ఆదివాసీ నిరుద్యోగులకు టీచర్స్ పోస్టులు కేటాయించాలని కోరారు. ఐదవ షెడ్యూల్డ్ పేరా 2 ప్రకారం రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేసే వరకు రాష్ట్రంలో ఆర్డినెన్సు అమలు చేయాలని, ప్రభుత్వం విజ్ఞప్తి చేశారు. జిఓ-3 రిజర్వేషన్ సాధించే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. 22 ఏప్రిల్ 2020లో ఆదివాసీల ఉద్యోగ రిజర్వేషన్ జిఓ-3 రద్దు చేస్తూ సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందన్నారు. అప్పటినుంచి ఆదివాసీలు జిఓ- 3 రిజర్వేషన్ కాపాడాలని, గిరిజన నిరుద్యోగులు కోసం ప్రత్యేక డిఎస్సి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వివిధ రూపాల్లో వినతులు, విజ్ఞప్తులు, నిరసనలు, ఆందోళనలు చేస్తున్నామన్నారు. గత వైసిపి ప్రభుత్వం జిఓ-3 రిజర్వేషన్ సమస్యను నాలుగేళ్లు అటకెక్కించిందని, ఆదివాసీల ఆందోళనలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చూపడంతో స్థానిక ఆదివాసిలకే దక్కాల్సిన ప్రభుత్వ ఉద్యోగాలు కోల్పోవాల్సి వస్తోందని తెలిపారు. ఈ క్రమంలో తాము అధికారంలోకి వస్తే జిఓ-3 రిజర్వేషన్ ను పునరుద్ధరిస్తామని 2024 జనవరి 20న అరకు ఎన్నికల సభలో ప్రతిపక్షనేతగా సిఎం చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. కోల్పోయిన ఉద్యోగ రిజర్వేషన్ కోసం ఆందోళనలు చేస్తున్నా సిఎం చంద్రబాబు హామీ నేటికీ అమలు చేయకపోవడం ఆదివాసీల హక్కులు, చట్టాలు, రిజర్వేషన్లపై నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. జిఓ-3 రిజర్వేషన్ కు ప్రత్యామ్నాయం చూపకుండానే ప్రభుత్వం మెగా డిఎస్ సి-2025 నిర్వహించడంతో ఆదివాసి యువతకు దక్కాల్సిన ఉద్యోగాలు కోల్పోయి తీవ్ర ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. నిరసనలు, ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం జిఓ-3 రిజర్వేషన్ కి సంబంధించి ప్రత్యామ్నాయం చూపడంలో, ఆదివాసీల ఉద్యోగ అవకాశాలు కాపాడే రిజర్వేషన్ ప్రక్రియను వేగవంతం చేయడంలో నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ధర్నా కార్యక్రమానికి పిలుపునివ్వడం జరిగిందన్నారు. ప్రభుత్వాలు ఆదివాసీల ఉద్యోగ రిజర్వేషన్ పై నిర్లక్ష్యం చేస్తోందని, పోరాటాలతోనే తమ హక్కులు, చట్టాలు, రిజర్వేషన్లను సాధించడం సాధ్యమవుతుందని, అన్ని సంఘాలు పార్టీలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

జోన్ 01 విశాఖపట్నం లో పాడేరు అల్లూరు జిల్లాను విలీనం చేయాలని డిమాండ్ చేశారు. రంపచోడవరం పాడేరు కలిసి ఉందని జోన్ 2 లో ప్రభుత్వం కలిపింది.

డీఎస్సీ సాధన కమిటీ కో కన్వీనర్ కూడా రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డిఎస్సి సాధన కమిటీ కన్వీనర్ సాగిన ధర్మానపడాల్ ఆదివాసీ నిరుద్యోగుల సంఘం జిల్లా కన్వీనర్ సత్యనారాయణ భాను డిపి శంకర్, భాను సిహెచ్ రావు, రాజం నాయుడు, దిలీప్ ఎస్ఎఫ్ఐ నాయకులు చిన్నారావు , కృష్ణం పడాల్, సురేష్, రాజేంద్రప్రసాద్, స్వాతి, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ సంఘ నాయకులు మద్దతు ఇచ్చారు: సలీం దీూ జిల్లా ప్రెసిడెంట్, కిరణ్ దీూ జిల్లా జనరల్ సెక్రెటరీ, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్వరరావు, కోటేశ్వరరావు, విజయ ప్రకాష్, ఎఎఅ పాత్రుడు, భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

# మారుమూల పల్లె నుంచి రాష్ట్ర స్థాయి కొలువుకు రెడ్డి విజయశాంతి



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, జనవరి 28:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం దారకొండ గ్రామానికి చెందిన గిరిజన యువతి రెడ్డి విజయశాంతి గ్రూప్2 ఫలితాల్లో సత్తా చాటి రాష్ట్ర స్థాయి ఉద్యోగానికి ఎంపికయ్యారు. గ్రూప్2 పరీక్షల్లో ఆమె అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (ఎఎస్ఓ)గా నియామకానికి అర్హత సాధించి, తన ప్రతిభను చాటుకున్నారు. ప్రస్తుతం చింతపల్లి మండలం చౌడుపల్లి పంచాయతీలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న విజయశాంతి, కష్టపడి చదివి ఈ స్థాయి విజయం సాధించడం పట్ల సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. విజయశాంతి తండ్రి రెడ్డి ధర్మయ్య గూడెం కొత్త వీధి మండల తహసీల్దార్ కార్యాలయంలో ఓఎస్గా విధులు నిర్వహిస్తుండగా, తల్లి సావిత్రి గృహిణి. మారుమూల గిరిజన గ్రామం నుంచి పంచాయతీ కార్యదర్శి స్థాయి ఉద్యోగం సాధించి, ఇప్పుడు రాష్ట్ర స్థాయి ఉన్నత ఉద్యోగానికి ఎంపిక కావడం యువతకు ఆదర్శంగా నిలుస్తోంది. ఆమె విజయంపై కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# విద్యార్థునులకు టైలరింగ్, బోటిక్ శిక్షణ తరగతులు

**కొయ్యూరు, పెన్ పవర్ జనవరి 28 :** మండలంలోని మర్రిపాలెం ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల విద్యార్థును లకు టైలరింగ్ బోటిక్ శిక్షణ తరగతులు ప్రారంభించారు. బుధవారంపీఎం ఉషా పథకం లో భాగంగా పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా. వి. చిట్టబ్బాయి ఆధ్వర్యంలో విద్యార్థినుల కోసం 15 రోజుల టైలరింగ్, బోటిక్ కోర్సును మర్రిపాలెం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సీఎంఎస్ ల్యాబొరేటరీస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. సుధ మాట్లాడుతూ...విద్యార్థినులు ఈ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకొని టైలరింగ్ మరియు బోటిక్ రంగాలలో తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.

ఈ కోర్సుకు రిసోర్స్ పర్సన్గా సూర్య కుమారి మాస్టర్



(శిక్షకురాలు) పాల్గొని, టైలరింగ్ మరియు బోటిక్ రంగాలకు సంబంధించిన ప్రాయోగిక శిక్షణను విద్యార్థినులకు అందిస్తున్నారు.

# పాఠశాల లేక గిరిజన విద్యార్థులు మూడు కిలోమీటర్లు కాలినడకన ప్రయాణం



**అనంతగిరి పెన్ పవర్, జనవరి 28.** అనంత గిరి మండలం, వెంకయ్యపాలెం గ్రామంలో ప్రభుత్వ పాఠశాల భవనం లేకపోవడం వల్ల

గిరిజన విద్యార్థులు సుమారు మూడు కిలోమీటర్ల దూరం చిలకలగెడ్డ గ్రామంలో గల పాఠశాల కి కాలినడకన వెళ్లే పరిస్థితి ఏర్పడిందని సిపిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు అభినయ దర్శన్ అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి గిరిజనుల గిరిజన విద్యార్థుల పరిస్థితి ఈ విధంగా ఉందని, ఇది గిరిజన విద్యార్థుల పట్ల కూటమి రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం అని తీవ్రంగా విమర్శించారు. విద్య అనేది ప్రతి పిల్లవాడి మౌలిక హక్కు అయినప్పటికీ, ఐదవ షెడ్యూల్ ప్రాంతాల్లోని గిరిజన విద్యార్థులను ఉద్దేశపూర్వకంగా విద్యకు దూరం చేసేలా పరిస్థితులు సృష్టిస్తున్నారని. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గారు, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి గారు,జిల్లా విద్యాశాఖ అధికారి గారు తక్షణమే స్పందించి, వెంకయ్యపాలెం గ్రామంలో పాఠశాల భవనం నిర్మాణం చేపట్టి

గిరిజన విద్యార్థులకు తక్షణమే విద్య అందించే ఏర్పాట్లు చేయాలనిడిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో పాస్టర్ తిమోతి, పాస్టర్ దానియేల్ ,గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గిరిజన విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఖండించారు. పాఠశాల లేకుండా గిరిజన అభివృద్ధి సాధ్యం కాదు. వెంటనే చర్యలు తీసుకోకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని సిపిఫ్ నాయకులు హెచ్చరించింది.

# ప్రజలకు సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందించాలి...!

* న్యాయమైన సేవలకు గ్రామ /వార్డు సిబ్బందికి శిక్షణ తరగతులు.
* ప్రోగ్రాం అధికారి రాజగోపాల్, అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారి రాజేష్




**కొయ్యూరు, పెన్ పవర్ జనవరి 28 :** ప్రభుత్వం ప్రజలకు అందించే సంక్షేమ పథకాలను పారదర్శంగా సేవలు అందించేందుకు సచివాలయ సిబ్బంది కృషి చేయాలని ప్రోగ్రాం అధికారి ఆర్. రామగోపాల్, అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి రాజేష్ , లోహిత్, పరిపాలన అధికారి బాల మురళీకృష్ణ లు అన్నారు. కొయ్యూరు మండల పరిషత్ కార్యాలయంలో అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఐటిడిఏ పాడేరు (గిరిజన సంక్షేమ శాఖ) లోని ప్రాజెక్టు మేనేజ్మెంట్ యూనిట్ (పిఎంయూ) ద్వారా చివరి స్థాయి సేవల అందజేతను బలోపేతం చేసే కార్యక్రమం కింద గ్రామ/వార్డు అచివాలయాల సిబ్బంది , డిజిటల్ అసిస్టెంట్ మరియు వెల్ఫర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు కు బుదవారం ఒక రోజు శిక్షణ అందించారు. ఈ శిక్షణలో సంక్షేమ పథకాలు తిరస్కరణలు, వాటి పరిష్కార విధానాలు, ఆధార్ కు సంభంధించిన సమస్యలపై చివరి స్థాయిలో సేవల అందజేయాతలో ఎదురయ్యే కార్యనిర్వహణ సమస్యలపై విస్తృతంగా వీరికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రోగ్రాం అధికార్లు మండల పరిషత్ పరిపాలన అధికారి బాల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# నాబార్డ్ ఆర్థిక సహకారంతో కాకనూరులో కల్చరల్ సొసైటీ కళాజాత



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,జనవరి 28:**నాబార్డ్ ఆర్థిక సహకారంతో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీలేరు బ్రాంచ్ ఆధ్వర్యంలో కాకనూరు గ్రామంలో బుధవారం విభూతి బ్రదర్స్ కల్చరల్ సొసైటీ కళాజాత వీధినాటిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీలేరు బ్రాంచ్ మేనేజర్ దేవదత్త సాహు నాయకత్వం వహించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అమలు చేస్తున్న వివిధ బ్యాంక్ స్కీములపై ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అవగాహన కార్యక్రమాన్ని కళాజాత నాటిక రూపంలో గిరిజనులకు వివరించారు. ప్రజలకు సులభంగా అర్థమయ్యే విధంగా ఆటలు, పాటలు, హాస్యం, మ్యాజిక్ షోలను వినియోగిస్తూ ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పింఛన్ యోజనతో పాటు డిజిటల్ బ్యాంకింగ్ సేవలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా గంజాయి వినియోగం వల్ల కలిగే అనార్థాలపై ప్రజల్లో అవగాహన కలిగేలా కళాజాత ద్వారా సందేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమం గ్రామస్తుల నుంచి విశేష స్పందన పొందింది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, బి.సి. పరమేశ్వరావు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# వరల్డ్ కప్ ముందు క్రేజీ సిరీస్: ఆస్ట్రేలియాతో పాకిస్థాన్ టీ20 సిరీస్.. లైవ్ స్ట్రీమింగ్, స్క్వాడ్, టైమింగ్ వివరాలు!



**హైదరాబాద్ పెన్ పవర్:** వరల్డ్ కప్ ముందు మరో క్రేజీ సిరీస్ క్రికెట్ ఫ్యాన్స్ ను అలరించడానికి సిద్ధంగా ఉంది. పాకిస్థాన్, ఆస్ట్రేలియా జట్లు మూడు మ్యాచ్ ల టీ20 సిరీస్ ఆడేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఇందులో భాగంగా తొలి మ్యాచ్ గురువారం (జనవరి 29) జరగనుంది. ఈ మ్యాచ్ కు లాహోర్‌లోని గడాఫీ స్టేడియం ఆతిధ్యమివ్వనుంది. ఆస్ట్రేలియా జట్టును మిచెల్ మార్ష్ లీడ్ చేయనున్నాడు. మరోవైపు పాకిస్థాన్ జట్టుకు సల్మాన్ అలీ అఘా నడిపించనున్నాడు. సొంతగడ్డపై ఆస్ట్రేలియాను ఓడించాలని పాకిస్థాన్ గట్టి పట్టుదలగా ఉంది. మరోవైపు వరల్డ్ కప్ ముందు ఉపఖండపు పరిస్థితులు అర్ధం చేసుకొని వరల్డ్ కప్ కు బరిలోకి దిగాలని కంగారూల జట్టు భావిస్తుంది.

ఓ వైపు ఇండియా, న్యూజిలాండ్ జట్లు విశాఖపట్నం వేదికగా ఈ రోజు నాలుగో టీ20 ఆడుతుంటే మరోవైపు ఆస్ట్రేలియా, పాకిస్థాన్ జట్లు రేపు లాహోర్ లో తొలి టీ20 ఆడనున్నాయి. ఈ రెండు రోజులు ఫ్యాన్స్ కు డబుల్ కిక్ ఖాయంగా కనిపిస్తుంది. ఆస్ట్రేలియా జట్టులో కీలక స్టార్లు జోష్ హాజిల్‌వుడ్, పాట్ కమ్మిన్స్, గ్లెన్ మాక్స్‌వెల్, టిమ్ డేవిడ్ స్వల్ప గాయాల కారణంగా సిరీస్ కు అందుబాటులో ఉండడం లేదు. ట్రావిస్ హెడ్, మిచెల్ మార్ష్, కామెరాన్ గ్రీన్, జోష్ ఇంగ్లిస్, మార్కస్ స్టోయినిస్, కూపర్ కొన్నోలీ, మిచ్ ఓవెన్ రూపంలో ఆస్ట్రేలియా బ్యాటింగ్ పటిష్టంగా కనిపిస్తుంది.

**పాక్ జట్టులో బాబర్, అఫ్రిది:**

ఇటీవలే జరిగిన బిగ్ బాష్ లీగ్ లో రాణించకపోయినా పాకిస్థాన్ టీ20 జట్టులో బాబర్ అజామ్ కు చోటు కల్పించారు. బిగ్ బాష్ లీగ్ లో బాబర్ 11 మ్యాచ్‌ల్లో 103.06 స్ట్రైక్ రేట్‌తో కేవలం 202 పరుగులు మాత్రమే చేశాడు. వరల్డ్ కప్ ముందు టోర్నీ కావడంతో బాబర్ అనుభవాన్ని పాక్ క్రికెట్ బోర్డు వినియోగించుకోవాలని చూస్తున్నట్టు అర్ధమవుతోంది. బాబర్ తో పాటు స్టార్ ఫాస్ట్ బౌలర్ షాహీన్ అఫ్రిది కూడా ఎంపికయ్యాడు. కొంతకాలంగా పాకిస్థాన్ టీ20 జట్టుకు దూరంగా ఉన్న అఫ్రిది జట్టులో చేరాడు. స్టార్ ప్లేయర్స్ మహ్మద్ రిజ్వాన్, హరిస్ రౌఫ్ వంటి సీనియర్ ఆటగాళ్లను పాకిస్థాన్ జట్టు నుండి తొలగించింది.

**ఆస్ట్రేలియాతో తలపడే పాకిస్తాన్ 16 మంది సభ్యుల జట్టు:**

సల్మాన్ అలీ అఘా (కెప్టెన్), అబ్రార్ అహ్మద్, బాబర్ ఆజం, ఫహీమ్ అష్రఫ్ , ఫఖర్ జమాన్,

ఖవాజా మహ్మద్ నఫాయ్ (వికెట్ కీపర్), మహ్మద్ నవాజ్, మహ్మద్ సల్మాన్ మీర్జా, మహ్మద్ వసీం జూనియర్, నసీమ్ షా, సాహిబ్జాదా ఫర్హాన్, సైమ్ అయూబ్, షహీన్ షా అఫ్రిది, షాదాబ్ ఖాన్, ఉస్మాన్ ఖాన్, ఉస్మాన్ తారిఖ్

**ఆస్ట్రేలియా జట్టు:**

మిచెల్ మార్ష్ (కెప్టెన్), సీన్ అబాట్, జేవియర్ బార్ట్‌లెట్, మహ్లి బియర్డ్‌మాన్, కూపర్ కొన్నోలీ, బెన్ ద్వార్షుయిస్, జాక్ ఎడ్వర్డ్స్, కామెరాన్ గ్రీన్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, మాథ్యూ కుహ్నెమాన్, మిచ్ ఓవెన్, జోష్ ఫిలిప్, మాథ్యూ రెన్షా, మాథ్యూ షార్ట్, మార్కస్ స్టోయినిస్, ఆడమ్ జంపా

**లైవ్ స్ట్రీమింగ్. లైవ్ టెలికాస్టింగ్ ఎందులో చూడాలంటే..?**

భారత కాలమాన ప్రకారం ఆస్ట్రేలియా, పాకిస్థాన్ జట్ల మధ్య తొలి టీ20 రాత్రి 8:30 గంటలకు ప్రారంభమవుతుంది. సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ ఛానెల్‌లలో ప్రత్యక్ష ప్రసారం చేయబడుతుంది. ఆన్‌లైన్ స్ట్రీమింగ్ వెబ్ బ్రౌజర్‌లలోని సోనీ లివ్ యాప్ లో చూడొచ్చు.

# హై స్కోరింగ్ థ్రిల్లర్‌కు రంగం సిద్ధం.. నాలుగో టీ20కి పిచ్ రిపోర్ట్, వాతావరం ఎలా ఉందంటే..?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియా, న్యూజిలాండ్ జట్ల మధ్య మరికొన్ని గంటల్లో నాలుగో టీ20 జరగనుంది. బుధవారం (జనవరి 28) ఇరు జట్ల మధ్య విశాఖపట్నం ఈ మ్యాచ్ కు వేదిక కానుంది. ఇప్పటికే ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 3-0తో కైవసం చేసుకున్న సూర్యకుమార్ సేన బుధవారం (జనవరి 28) జరిగే నాలుగో టీ20లోనూ గెలిచి క్లీన్ స్వీప్ లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. మరోవైపు ఇప్పటికే సిరీస్ కోల్పోయిన కివీస్ నాలుగో టీ20లో ఇండియాకు షాక్ ఇచ్చి ఎలాగైనా బోణీ కొట్టాలని కసరత్తులు చేస్తుంది. ప్రస్తుతం 5 మ్యాచ్ ల టీ20 సిరీస్ లో ఇండియా 3-0 ఆధిక్యంలో నిలిచింది. నాలుగో టీ20 బుధవారం (జనవరి 28) సాయంత్రం 7:00 గంటలకు ప్రారంభమవుతుంది. అభిషేక్ శర్మ, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, ఇషాన్ కిషన్ ధనాధన్ షాట్లతో ప్రత్యర్థి బౌలర్లను ముప్పుతిప్పలు పెడుతున్నారు. ముఖ్యంగా యంగ్ ఓపెనర్ అభిషేక్ శర్మ 300 ప్లస్ స్ట్రైక్ రేట్‌తో రన్స్ రాబడుతుండటం విశేషం. 200 ప్లస్ టార్గెట్‌ను 15 ఓవర్లలో.. 150 పైచిలుకు లక్ష్యాన్ని పది ఓవర్లోనే ఛేజ్ చేయడం చూస్తుంటే, కివీస్ బౌలర్లకు ఈ మ్యాచ్‌లోనూ నిద్రలేకుండా చేసేలా కనిపిస్తోంది. నాలుగో టీ20లో ఇండియా రెండు మార్పులతో బరిలోకి దిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. స్టార్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యకు నాలుగో టీ 20లో రెస్ట్ ఇవ్వనున్నట్టు తెలుస్తుంది. పనిభారం కారణంగా ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా వైజాగ్ టీ20కు దూరం కానున్నాడు.

**వైజాగ్ వాతావరం రిపోర్ట్స్:**

అక్యూవెదర్ యాప్ ప్రకారం.. బుధవారం (జనవరి 28) ఉదయం ఉష్ణోగ్రత 26 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉంది. మధ్యాహ్నం తర్వాత ఉష్ణోగ్రత కొద్దిగా 27 డిగ్రీలకు పెరిగి సాయంత్రం 21 డిగ్రీలకు పడిపోతుంది. ఎలాంటి వర్ష సూచనలు మ్యాచ్ కు ఉండవు. నైట్ ఎక్కువగా మంచు పడేఅవకాశాలు ఉన్నాయి.

**పిచ్ రిపోర్ట్ ఎలా ఉందంటే..?**

పిచ్ విషయానికి వస్తే వైజాగ్ టీ20కు పరుగుల వరద ఖయాంగా కనిపిస్తుంది. సాధారణంగా ఇక్కడ వికెట్ బ్యాటర్లకు అనుకూలంగా ఉంటుంది. దీంతో ఈ మ్యాచ్ లో హై స్కోరింగ్ అని ఫ్యాన్స్ ఫిక్సయిపోయారు. మొదటి బ్యాటింగ్ సమయంలో పిచ్ కొంచెం నెమ్మదిగా ఉండి స్పిన్నర్లకు అనుకూలంగా ఉంటుంది. రెండో ఇన్నింగ్స్ సమయంలో మంచు ప్రభావం ఎక్కువగా ఉంటుంది. దీంతో టాస్ గెలిచిన జట్టు మొదట బౌలింగ్ తీసుకునే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

# ఐసీసీ ర్యాంకింగ్స్... టాప్ 10లోకి సూర్యకుమార్ యాదవ్, నెంబర్ 1 స్థానంలోనే అభిషేక్

- న్యూజిలాండ్ సిరీస్‌లో అదరగొడుతున్న సూర్యకుమార్, అభిషేక్ శర్మ
- 929 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానాన్ని పదిలం చేసుకున్న అభిషేక్
- ర్యాంకింగ్స్‌లో బుమ్రా, హార్దిక్ పాండ్య, శివమ్ దుబేలకు చోటు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో భారత క్రికెట్ జట్టు సారథి సూర్యకుమార్ యాదవ్ టాప్ టెన్ బ్యాట్స్‌మెన్ జాబితాలో తిరిగి చోటు దక్కించుకున్నాడు. న్యూజిలాండ్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో అదరగొడుతున్న సూర్యకుమార్ ఐదు స్థానాలు ఎగబాకి 717 రేటింగ్ పాయింట్లతో ఏడో స్థానానికి ఎగబాకాడు. పొట్టి క్రికెట్‌లో పరుగులు సాధించడానికి ఇబ్బంది పడుతున్న సూర్యకుమార్, ఫామ్‌లోకి వచ్చాడు. న్యూజిలాండ్‌తో జరిగిన రెండవ టీ20లో 82, మూడో టీ20లో 57 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. భారత ఓపెనర్ అభిషేక్ శర్మ కూడా మూడో టీ20లో 68 పరుగులతో అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 14 బంతుల్లోనే అర్ధ సెంచరీ చేశాడు. నాగపూర్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో 35 బంతుల్లో 84 పరుగులు చేశాడు. తాజా ఐసీసీ ర్యాంకింగ్స్‌లో 929 రేటింగ్ పాయింట్లతో తన అగ్రస్థానాన్ని పదిలం చేసుకున్నాడు.

భారత బౌలర్లలో జస్ప్రీత్ బుమ్రా నాలుగు స్థానాలు ఎగబాకి 13వ ర్యాంకులో నిలిచాడు. మూడో టీ20లో మూడు వికెట్లు తీసి రాణించాడు. ఆల్ రౌండర్ల విభాగంలో హార్దిక్ పాండ్య ఒక స్థానం ఎగబాకి మూడో ర్యాంకుకు, శివమ్ దుబే ఐదు స్థానాలు ఎగబాకి పదకొండవ ర్యాంకుకు చేరుకున్నారు. అక్షర్ పటేల్ 3 స్థానాలు పడిపోయి 13వ ర్యాంకులో ఉన్నాడు.

# హీరో నేనే విలనూ నేనే.. 'యానిమల్' 3 భాగాలుగా!



**శివంగి వర్మ తాజా స్నాప్‌లలో ఉష్ణోగ్రతను పెంచారు**





**కావ్య థాపర్ టైమ్‌లెస్ ఎత్నిక్ స్టైల్‌తో ఆకట్టుకుంది**

రణబీర్ కపూర్ - సందీప్ వంగా కాంబినేషన్‌లో -యానిమల్- సంచలన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఇది కేవలం ఒక సీక్వెల్‌తో ముగిసిపోయేది కాదు.. మొత్తం మూడు భాగాలుగా రాబోతోంది. ఆ మేరకు రణబీర్ కపూర్ స్వయంగా ఈ విషయాన్ని ధృవీకరించారు.

దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ఈ కథను ఒక ట్రయాలజీగా ప్లాన్ చేశారు. మొదటి భాగం -యానిమల్- కాగా, రెండో భాగం -యానిమల్ పార్క్-. మూడవ భాగానికి సంబంధించిన వివరాలు వెల్లడి కావాల్సి ఉంది. ఇంతలోనే ఇప్పుడు యానిమల్ సీక్వెల్ -యానిమల్ పార్క్- షూటింగ్ 2027 లో ప్రారంభం కానుందని రణబీర్ ధృవీకరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో కొన్నాళ్ల పాటు వేచి చూడక తప్పదని కూడా రణబీర్ అన్నారు. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ప్రస్తుతం ప్రభాస్ హీరోగా -స్పిరిట్- సినిమా పనుల్లో బిజీగా ఉన్నారు. ఆ సినిమా పూర్తయిన తర్వాతే సీక్వెల్ పట్టాలెక్కుతుంది. యానిమల్ రెండో భాగంలో రణబీర్ కపూర్ ద్విపాత్రాభినయం చేస్తారు. మొదటి భాగం చివరలో చూపించిన నెగటివ్ క్యారెక్టర్ (అజీజ్) కి, రణవిజయ్ కి మధ్య జరిగే పోరు చాలా భయంకరంగా ఉండబోతుందని సమాచారం.రెండో భాగంలో విలన్ ఎవరంటే..? మొదటి భాగం చివరిలో అజీజ్ అనే పాత్ర ప్లాస్టిక్ సర్జరీ ద్వారా రణబీర్ (రణవిజయ్) పోలికలను పొందుతుంది. అంటే రెండో భాగం -యానిమల్ పార్క్-లో రణబీర్ తనతో తనే యుద్ధం చేసుకోబోతున్నారు. ఈ సినిమాలో విలన్ -అజీజ్- పాత్ర రణవిజయ్ కంటే క్రూరంగా ఉంటుందని సమాచారం. --ఇది చాలా థ్రిల్లింగ్‌గా ఉంది. హీరో, విలన్.. ఈ రెండు పాత్రలనూ నేనే పోషిస్తున్నాను-- అని రణబీర్ స్వయంగా వెల్లడించారు.మొదటి భాగంలో తండ్రి (అనిల్ కపూర్) కోసం రణవిజయ్ చేసిన విధ్వంసాన్ని చూశాం. రెండో భాగంలో ఈ బంధం ఇంకా ఏ మలుపులు తిరుగుతుందో, తండ్రిని కాపాడుకోవడానికి ఈ -డబుల్ రోల్- చిక్కుముడులను రణవిజయ్ ఎలా విప్పుతాడో అనేది కథలో కీలకం కానుంది.2027లో యానిమల్ పార్క్ షూటింగ్ మొదలవుతుంది. అయితే అంతకంటే ముందే రణబీర్ నుండి మరికొన్ని భారీ చిత్రాలు రానున్నాయి. వీటిలో భన్సాలీ -లవ్ అండ్ వార్- జూన్ 2026లో విడుదల కానుంది. అటుపై నితీష్‌తివారీతో -రామాయణం- 2026 దీపావళికి విడుదలవుతుంది.సీక్వెల్ ఆలస్యానికి కారణమేమిటి? అని ప్రశ్నిస్తే, సినిమా నాణ్యతను పెంచడానికే తప్ప వెనకడుగు వేయడం కాదని రణబీర్ స్పష్టం చేశారు. సందీప్ వంగా ఈ పాత్రల మనస్తత్వాలను ఇంకా లోతుగా విశ్లేషించాలని భావిస్తున్నారు. సందీప్ రెడ్డి వంగా సినిమాల్లో ఉండే ఆ -తీవ్రమైన డ్రామా-ను మళ్ళీ పెద్ద తెరపై చూడాలంటే 2027 వరకు ఓపిక పట్టాల్సిందే!

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at H.NO: 38-4-216, MAHARANI STREET, MARRIPALEM, Visakhapatnam,Andhrapradesh-530018, Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, editorpenpower@gmail.com